స్థాపితము 1926 రిజిస్టర్ నెం. 92

గోలకొండ పత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి, ఎం.ఏ

సంపుటి: 11 సంచిక: 61 : : హైదరాబాద్, సోమవారం 6-3-1961 : : 4 పేజీలు; 7 నయాపైసలు

101354

నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికలు

నిజామాబాదు, మార్చి 5: పార్టీ ప్రాతిపదికపై నిజామాబాదులో మున్సిపల్ ఎన్నికలు జరుపరాదని నిజామాబాదు పట్టణ ప్రజలు నేడు టౌన్‌హాలులో సమావేశమై నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో పట్టణ కమిటి చైర్‌మన్ కిషన్‌దాస్ కన్వీనరుగా సిటిజన్స్ కమిటి ఏర్పరచబడినది. ఇది మున్సిపల్ ఎన్నికలకై పార్టీవివక్షతల పాటింపకుండా వివిధ మహల్లాలనుండి సమర్థులైన అభ్యర్థుల ఎంపికచేయగలదు.

నిజామాబాదులో మున్సిపల్ ఎన్నికలు ఏప్రిల్ 24 న జరుగుతవి. నామినేషన్‌లకు తుది తేదీ మార్చి 20.

రిజర్వుబ్యాంక్ గవర్నర్ రాష్ట్రపర్యటన

హైద్రాబాదు, మార్చి 5: భారతదేశ రిజర్వుబ్యాంకు గవర్నర్ శ్రీ బుర్రా వెంకటప్పయ్య ఈ నెల 8 నుంచి 20 వ తేదీవరకు ఆంధ్రప్రదేశులో పర్యటిస్తారు. ఆయన పర్యటనలో రాష్ట్రంలోని వివిధ సహకార సంస్థలు సహకార పద్ధతులలో నిర్వహించబడే బ్యాంకులు పంచదార మిల్లులు, చేనేతపారిశ్రామికసంస్థలు, భూతనఖా బ్యాంకులు సందర్శిస్తారు. శ్రీ వెంకటప్పయ్య అధికాహారోత్పత్తి సాగించేందుకు అనుసరించే వ్యవసాయ కార్యక్రమ నిర్వహణలో యెదురయ్యే సమస్యలనుగురించి చర్చలు జరుపుతారని తెలుస్తున్నది.

పశుసంపదపట్ల ఇతోధిక శ్రద్ధాసక్తుల ఆవశ్యకత

మనం మిశ్రమ వ్యవసాయ పద్ధతి నవలంబించాలి

లేకున్న 400 కోట్ల పశువులకు ఆహారము సక్రమంగాలభింపదని శ్రీ కె.సి. రెడ్డి స్పష్టీకరణ

హైద్రాబాదు, మార్చి 5

ప్రస్తుతమున్న ఏకవిధమైన వ్యవసాయ పద్ధతుల స్థానే మిశ్రమ వ్యవసాయ పద్ధతులను అవలంబించకున్న దేశమునందలి 400 కోట్ల పశువులకు పశుగ్రాసం, యితర ఆహారము లభించుటకు అవకాశాలు తగ్గిపోగలవని నేడిచట కేంద్రమంత్రి శ్రీ కె. సి. రెడ్డి అన్నారు.

జాతీయ పశుసంపద సంఘం ఆధ్వర్యమున యేర్పాటుచేయబడిన అఖిల భారత పశువుల కోళ్ళ ప్రదర్శనమునకు శ్రీ కె.సి.రెడ్డి నేడు ఇచట ప్రారంభోత్సవం జరిపారు. ఉత్సవమునకు ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య అధ్యక్షత వహించారు. కేంద్ర వ్యవసాయ ఉపమంత్రి శ్రీ ఎం వి. కృష్ణప్ప శ్రీ కె.సి. రెడ్డికి స్వాగతం చెప్పారు.

దేశమంతటినుండి 1000 మంది 30 రకాల ఉత్తమ భారతపశుసంతతిని 25 జాతుల కోళ్ళను ప్రదర్శించుటకు తెచ్చారు.

ఇతర దేశాలకన్నా భారతదేశంలో ప్రతిఒక్కరికీ వ్యవసాయయోగ్యమైన ప్రతిఎకరము భూమికి అధిక పశువులున్నవి. దేశంలో 1530 లక్షల పశువులు 450 లక్షల బర్రెలు వున్నవి. ప్రపంచమందలి బర్రెలలో భారతదేశము 25 శాతం కలిగియుంది. ఇవేకాక 990 లక్షల గొర్రెలు, 550 లక్షలమేకజాతి, 15లక్షల గుర్రములు, 70 లక్షల ఇతర పశువులు, 941 లక్షల కోళ్ళు ఉన్నవని శ్రీ కె. సి. రెడ్డి చెప్పారు.

పశువులవలని సాగుచున్న పరిశ్రమలవల్ల సంవత్సరమునకు రు. 4వేలకోట్ల విలువగల ఉత్పత్తి జరుగుచున్నదని; ఇందు పాలు, పాలఉత్పత్తులు, తోళ్ళు, పశువుల కష్టంకూడా గణించబడిందని అంతేగాక పశువులనుండి లభించు ఎరువుల వలనకూడ భూమినుండి వచ్చు ఆదాయం పెరుగుచున్నదని శ్రీ కె సి. రెడ్డి అన్నారు.

మనదేశంలో పశుసంపద అభివృద్ధికి ఎన్నో ఆటంకాలున్నవి. 400కోట్ల పశువులు వ్యవసాయం చేయబడునట్టి 3200 లక్షల ఎకరముల భూమిపై ఆధారపడియున్నవి. వ్యవసాయమువలన లభించు మేతపై యితర వస్తువులపై, బీడు మరియు వ్యవసాయమునకు అయోగ్యమగు భూములందు లభించు పశుగ్రాసంపై పశువులు ఆధారపడవలసివుంది. తత్ఫలితంగా వాటికి సరియైన ఆహారమును లభింపజేయలేకున్నాం.

"ముందు ముందు పశువులను రెండు ఉద్దేశాలతో అభివృద్ధిపరచాలి. గో సంతతి తగుపాలను యివ్వాలి. ఎద్దులు వ్యవసాయమున కుపకరించాలి" అని శ్రీ కె.సి. రెడ్డి చెప్పారు.

అంతకుముందు శ్రీ కృష్ణప్ప మాట్లాడుచు దేశ పశుసంపదనభివృద్ధి పరచకున్న వ్యవసాయాభివృద్ధి జరుగదని అన్నారు. పశు సంపదలో ఆంధ్రప్రదేశ్ సంపన్నదేశం. ఇచటి ప్రజలకు పశువులంటే మిక్కిలి అభిమానం కూడ. అందువల్లనే ఆసియాలో రెండవ పెద్దదనబరగు రు. 3 కోట్ల పాలపొడి ఫ్యాక్టరీని కృష్ణాడెల్టా ప్రాంతమందు స్థాపించుటకు భారత ప్రభుత్వం నిశ్చయించిందని శ్రీ కృష్ణప్ప తెలిపారు.

జబల్‌పూర్‌వంటి దుస్సంఘటనలు

ముందు జరగకుండా అరికట్టబడాలని శ్రీ నెహ్రూ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 5

జబల్‌పూర్‌లో జరిగినట్టి దుస్సంఘటనలు యికముందు జరగకుండ సాంఘికవాతావరణములో ఒక విధమైన మార్పు తెచ్చుటకు కాంగ్రెస్ కమిటీలు, యితరఅనధికార సంఘాలు కృషిచేయాలని నిన్న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుచు శ్రీ నెహ్రూ కోరారు.

దుస్సంఘటన జరగకుండా అరికట్టేందుకై జిల్లా అధికారులు జాగరూకులై ఉండాలని కూడ ఆయన అన్నారు.

ఈ సందర్భమున కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డికి ఎమ్. పి. లు సేకరించిన రు. 10,500 విరాళం చెక్కు సమర్పింపబడింది. ఈ మొత్తం జబల్‌పూర్ బాధితుల సహాయార్థం సేకరింపబడింది. కాంగ్రెస్ అధ్యక్షులు మార్చి 12 నుండి సాగర్, జబల్‌పూర్‌లను పర్యటిస్తారని. కాంగ్రెస్ పార్టీకిచెందిన 4 గురు సభ్యుల బృందం కూడ వచ్చేవారం మధ్యప్రదేశ్‌కు వెళ్లి ప్రశాంత వాతావరణమును సృష్టించుటకు యత్నిస్తుందని శ్రీ నెహ్రూ యీ సమావేశంలో వెల్లడించారు.

పింప్రీలోని పంపుల ఫ్యాక్టరీ

అంతర్జాతీయ ఆర్థిక కార్పొరేషన్ సహాయం

కొత్త ఢిల్లీ, మార్చి 5

ప్రత్యేక రకముల పంపులు తయారీకిగాను కె. ఎస్. బి పంప్స్ లిమిటెడ్ అను ప్రయివేటు లిమిటెడ్ కంపెనికి అంతర్జాతీయ ఆర్థిక కార్పొరేషన్ 2.1 లక్షల డాలర్ల సహాయాన్ని ఇవ్వనున్నది. ఈ పంపుల ఫ్యాక్టరీ పూనాకు సమీపంలోగల పింప్రీలో కలదు.

పాకిస్తాన్‌లో చమురు పరిశోధన

రష్యాచే 300 లక్షల డాలర్ల ఋణం

కరాచీ, మార్చి 5

పాకిస్తాన్‌లో చమురు పరిశోధనకు రష్యా సాంకేతిక, ఆర్థిక సహాయము చేయునట్టి ఒడంబడిక ఒకటి నిన్న రెండు దేశాల ఆమోదాన్ని పొందింది రతఈఒడంబడికప్రకారము పాకిస్తాన్. ప్యానుండి 12 సంవత్సరాల తర్వాత 2 1/2 శాతము వడ్డీతో చెల్లింపబడుటకు వీలుగా 300 లక్షల డాలర్ల ఋణము పొందుతుంది. ఈఋణము తిరిగి పాకిస్తాన్ వస్తు రూపములో చెల్లిస్తుంది. రష్యా యిచ్చు ఋణాన్ని అచటి యంత్రాలను, వస్తువులను కొనుటకు దానిచే నియమింపబడు సాంకేతిక నిపుణుల వేతనాలిచ్చుటకు పాకిస్తాన్ వినియోగిస్తుందట.

పండిత్ పంత్ ఆరోగ్యస్థితి

న్యూఢిల్లీ, మార్చి 5

పండిత్ పంత్ ఆరోగ్యస్థితి అత్యంత ఆందోళనకరంగానే ఉన్నదని పరిస్థితిలో మార్పేమీ లేదని డాక్టర్లు తెలుపుతున్నారు.

నేడు సాంతం పంత్‌జీ ఆరోగ్యపరిస్థితి అస్థిమితంగానే వున్నది. రక్తపు ఒత్తిడిని నిలకడగా చేయడం సాధ్యమైనది. కాని సాయంత్రం ఉచ్ఛ్వాస నిశ్వాసాలు చాలా భారంగా సాగుతున్నవి.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని నెహ్రూ కేంద్రమంత్రులుపార్లమెంటు సభ్యులు నేడు పండిత్ పంత్‌ను చూచారు.

హైద్రాబాదులో అడ్మిరల్ కటారి

6వ తేదీద పాలక సిబ్బంది కళాశాల సందర్శన

హైద్రాబాదు, మార్చి 5

నౌకాదళ సిబ్బంది ప్రధాని వైస్ అడ్మిరల్ ఆర్. డి. కటారి సతీసమేతముగా నిన్నఉదయం ఇక్కడకు బొంబాయినుంచి భారత వైమానిక దళ విమానంలో వచ్చారు. ఆయన నగరములో మూడు రోజులుంటారు.

బొగారం విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం యిచ్చిన వారిలో గ్రూప్ కెప్టెన్ ఎస్. డబ్ల్యు. కర్నల్ జోరాసింగ్, వింగ్ కమేండర్ అగ్రి, శ్రీ విజనారాయణ్, లెఫ్టినెంట్ కర్నల్ దిలీప్ సింగ్ ప్రభృతులున్నారు.

కర్నల్ జోరాసింగ్‌తో కలిసి నౌకాదళ సిబ్బంది ప్రధాని భూమ్యాకాశ యుద్ధతంత్ర శిక్షణ సంస్థను సందర్శించారు. ఈ అంతర్యాయుధ దళాల శిక్షణసంస్థను ఆయన సందర్శించడం ఇదే మొదటిసారి. అడ్మిరల్ కటారి ఇక్కడకు విచ్చేసిన సందర్భంలో పై సంస్థ విద్యార్థులు వైమానిక యుద్ధతంత్రంలో నౌకాదళం వహించే పాత్రను వివరించే ఒక నాటికను ప్రదర్శించారు. పైనిక వైమానిక దళ ఉద్యోగులు పాల్గొన్న ఒక విన్యాసం కూడా చూచారు.

ఈ సంస్థలో శిక్షణార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆధునిక యుద్ధతంత్రములో సాయుధ దళాలు పరస్పరం ఉపకరించుకోవలసిన అవసరాన్ని గురించి వేరే చెప్పనక్కర్లేదని అన్నారు అడ్మిరల్ కటారి.

ఈ సంస్థ వైశిష్ట్యంగల శిక్షణసంస్థ. ఆసియాలో ఖండంలో ఇట్టి శిక్షణ గరిపే సంస్థ ఇది ఒక్కటే. రక్షణ మంత్రి శ్రీ వి. కె. కృష్ణమేనన్ ఈ సంస్థకు హైద్రాబాదులో 1959 సెప్టెంబర్‌లో ప్రారంభోత్సవం చేశారు.

ఆ తర్వాత అడ్మిరల్ కటారి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్యను ఆయన ఇంటివద్ద కలుసుకొన్నారు. అడ్మిరల్ కటారి ఆయన సతీమణి, ముఖ్యమంత్రి ఇంటిలో విందారగించారు.

నౌకాదళ సిబ్బంది ప్రధాని ఢిల్లీకి తిరిగి వెళ్ళేముందు మార్చి 6వ తేదీ సోమవారంనాడు హైద్రాబాదులోని పాలక సిబ్బంది కళాశాలను సందర్శిస్తారు.

నేషనల్ టుబాకో కంపెనీ కార్మికుల సమ్మె

గుంటూరులో

హైద్రాబాదు, మార్చి 5

సంస్థ పాలకవర్గం కొంతమంది కార్మికులను పని నుంచి తొలగించివేయడంవలన గుంటూరు నేషనల్ టుబాకోకంపెనీ కార్మికులు 15 వందల మందికి పైగా మొన్న పనికి హాజరుకాలేదని యిక్కడకు అందిన వార్తవల్ల తెలుస్తున్నది.

.....

బోలెపల్లిలో 40 ఏండ్ల వితంతువు హత్య

అనుమానంమీద ముగ్గురు అరెస్టు

మానుకోట, మార్చి 5

నరసంపేట తాలూకా బోలెపల్లి గ్రామంలో 40 ఏండ్ల వితంతువును యీనెల 7 న ముగ్గురు గొంతుపిసికి చంపారని, వారు శవాన్ని పూడ్చిపెట్టారని తర్వాత ఈ ముగ్గురిని నల్లబల్లి పోలీసు సిబ్బంది అనుమానించి అరెస్టుచేసినట్లు తెలుస్తున్నది.

నర్సంపేట మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టులో వీరందరిమీద హత్యాభియోగం క్రింద పెట్టబడ్డ కేసుత్వరలో విచారణ జరుగుతుందని తెలుస్తున్నది.

FOR
FIRST CLASS DRY CLEANING
Remember
Fashions
ELECTRIC
DRY-CLEANERS

గిజెంగా, కషామురా, ఇలియో

ఎలిజబెత్ విల్లేకు ఆగమనం

బ్రసెల్స్, మార్చి 5

అంటోనియో గిజెంగా (స్టాన్‌లివిల్లే ప్రధాని), స్టాన్‌లివిల్లే అధ్యక్షులు అనిసెంట్ కషాముర ఎలిజబెత్‌విల్లేకు వచ్చినట్లు నిన్న బ్రసెల్స్ వార్తా సంస్థ ప్రకటించింది. లియోపోల్డువిల్లే ప్రధాని జోసెఫ్ ఇలియాతో కూడ వారు విమానం నెక్కారని ఆ వార్తలో తెలుపబడింది.

కాంగోసమస్యసుపరిష్కరించుటకు మలగసీ రాజధానికి ఆహ్వానింపబడిన వారిలోపై ముగ్గురుకూడా ఉన్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో ఎరువుల ఫ్యాక్టరీ స్థాపన

25 మిలియన్‌ల డాలర్ల ఋణమివ్వ జపాన్ సంకల్పం

టోకియో, మార్చి 5

భారతదేశంలో ఎరువుల కర్మాగార స్థాపనకై 25 మిలియన్‌ల డాలర్ల ఋణాన్నిచ్చుటకు జపాన్ వాణిజ్య మంత్రాంగం ఒక పథకాన్ని సిద్ధంచేసినది. ఈ కర్మాగారస్థాపనకై భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపడానికి జపాన్ ప్రభుత్వం నల్గురు సభ్యుల టీమును త్వరలో పంపగలదు. ఈ బృందం రెండు నెలలు భారతదేశంలో పర్యటించగలదు.

జపాన్ పథకాన్ని అనుసరించి ఉత్తరప్రదేశ్‌లో ఎరువుల ఫ్యాక్టరీ స్థాపించబడగలదని ఇది ఏడాదికి 150 వేల టన్నుల రసాయనిక ఎరువుల ఉత్పత్తి చేయగలదని భావింపబడుచున్నది.

స్టాన్లీవిల్లేలో 75గురి వధ

లుముంబా అనుయాయులు చేసినట్లు వార్త

లియోపాల్డువిల్లే, మార్చి 5

లుముంబా అనుకూలవాయకులగు అంటోనీగిజెంగా, జనరల్ లుందూలాఆదేశంపై స్టాన్లీవిల్లేలో ఒక వారంలోపుగా 75 గురిని వధించినట్లు కేంద్ర ప్రభుత్వ ప్రెస్ సర్వీస్ నిన్న ప్రకటించింది.

వధింపబడిన వారిలో 13 గురు పార్లమెంటు సభ్యులు, 22 గురు రాజకీయ ఖైదీలు 25 గురు అధికారులు, బుకువులో బంధించిన 15 గురు కేంద్ర ప్రభుత్వ పారాకమాండర్లు ఉన్నట్లు ఆ ప్రకటనలో పేర్కొనైనది.

పై వధలను వ్యతిరేకించిన జనంపై కాల్పులు జరుపగా 100 మంది చనిపోయారనికూడ ఆప్రకటనలో ఉంది. ఈవిషయమై సమితికి శీఘ్ర వ్యతిరేకతను తెలియజేయబడిందట.

రైతుకు ఎద్దులు భారమా?

హైద్రాబాద్, మార్చి 5

ఇరువై ఇరువైఐదు సంవత్సరాలలోగా భారతీయ రైతుకు ఎద్దులు భారంగా తయారవగలవని ఇప్పుడు యెద్దులు చేస్తున్న పనిని యంత్రాలు ఆక్రమిస్తున్నాయన్నారు.

దున్నడం నీరు తోడటం గానుగాడటం చెరుకు రసం తీయడానికి ఎద్దులకు మారు ట్రాక్టర్లు ఎలక్ట్రిక్ పంపులు ఎన్స్ పెల్లర్లు విద్యుచ్ఛక్తి క్రషర్లు వస్తున్నాయని తెలిపారు.

పోలీసు ఇనస్పెక్టరు జనరలు పదవులు

ఆంధ్ర ప్రదేశ్ అవతరణ సమయంలోనే భర్తీచేయబడ్డాయని ముఖ్యమంత్రి పెల్లడి

హైద్రాబాదు, మార్చి 5

1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ సమయంలో రాష్ట్రమందలి 2 పోలీసు అసిస్టెంటు యినస్పెక్టర్ జనరల్ పదవులు భర్తీ చేయబడ్డాయని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లకు నిన్న అసెంబ్లీలో చెప్పిన జవాబులో పేర్కొన్నారు.

ఈ పదవులకు శ్రీ యం. కృష్ణమూర్తి, ఐ. పి. ఎస్; శ్రీ జె శల్ఖానా, ఏ. పి. ఎస్. లను నియమించటం జరిగింది. 1959 సెప్టెంబరు 6న శ్రీ కృష్ణమూర్తి పదవీ విరమణ చేసిన తర్వాత ఆయన స్థానే దానిలో శ్రీ వి. ఎస్. రామమూర్తి ఐ. పి. ఎస్. నియుక్తులయినారు. రెండవ పదవికి చెంది సల్ఖానా 1930 జూన్‌లో అనంతపురం బదిలీ చేయటం జరిగిందని ఆయన బదులు దానిలో శ్రీ ఎ. ఎస్ బాల్‌రాజ్ మొదలియార్ ఐ. పి. ఎస్. ఎస్.ను గత జూన్2న నియమించినట్లున్నూ ఆయన పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి వివరించారు.

నెల్లూరు జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాల విషయంలో ఏలాంటి మార్పులు ఎలెక్షన్ కమిషన్ చేయలేదని, 1956లో నియమించబడిన డిలిమిటేషన్ కమిషన్ కొన్ని మార్పులు చేసిందని ముఖ్యమంత్రి శ్రీ కె. వెంకటరెడ్డి ప్రశ్నకు సమాధానం చెబుతూ కావలి యిదివరకు యేకసభ్య నియోజకవర్గంగా వుండేదని, యీ మార్పులు జరిగినతర్వాత ద్విసభ్య నియోజకవర్గంగా రూపొందిందని దీనిలో ముందిపాడు ఆసెంబ్లీ నియోజకవర్గ సభ్యత్వ స్థాయి చేర్పబడిందని కొందజాతులకు ప్రత్యేకస్థానం యివ్వబడుతుందని వివరించారు.

విస్తృత హైద్రాబాదు నగరానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు రోడ్డు రవాణా శాఖకు చెందిన బస్సులలో తిరిగేందుకు కన్సెషన్లు పొందే అవకాశం లేదని గోకా రామలింగం అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య జవాబు చెప్పారు.

శ్రీ రామలింగం అడిగిన ప్రశ్నలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న టీచర్లు ఎస్ జి.ఓ లకు లభిస్తున్న బస్సు కన్సెషన్లు పొందుటకు వీలుంటుందా అని అడిగారు. రాష్ట్ర పబ్లిక్ వర్క్సు మంత్రికి బదులు ప్రణాళికశాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి శ్రీ కె. వెంకటరెడ్డికి యిచ్చిన జవాబులో యిలా అన్నారు:

నెల్లూరు జిల్లాలోనిసోమశిల ప్రాజెక్టుకు చెందిన ఖర్చు తగ్గడానికి పబ్లిక్ వర్క్సు శాఖ స్పెషల్ చీఫ్ యింజనీరు ఒక పథకాన్ని తయారు చేశారని దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపవలసియున్నదని కొత్త పథకం దృష్ట్యా రూ. 10.88 కోట్లు ఖర్చు కాగలదని తేలిందని యిది తృతీయ పంచవర్ష ప్రణాళికలో చేర్చలేదని, ఆంధ్రప్రదేశ్, మద్రాసు ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యాన అమలుపరాలనే ఆలోచనలేదని ఆయన స్పష్టం చేశారు.

అఖిలభారత గ్రామీణ కీలక పథకము క్రింద రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖకు చెందిన 81 కేంద్రాలు అభివృద్ధి చేయబడ్డాయని ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య శ్రీ నాగిరెడ్డికి తెలియచేశారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక శాఖల మంత్రి శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి సభలో శ్రీ తెల్లాకుల జాలయ్యకు చెప్పిన జవాబులో యిలా పేర్కొన్నారు:

కేంద్ర ప్రభుత్వానికి ధాన్యపు నిల్వలు సరఫరా చేయుటకు వ్రాసుకొన్న కంట్రాక్టు షరతుల ప్రకారం వర్తకులు సరుకు రవాణా చేయవలసి వుంటుంది. ధాన్యపు మిల్లుల యజమానులు వాగన్లకొరకు రైల్వే అధికారులకు పంపిన యిండెంట్ల దృష్ట్యా వాటి సరుకు చేరవలసిన స్టేషన్ల వివరాలు తెలిసి వుంటుంది.

వర్తకులవద్ద కొన్న ధాన్యం నిల్వలు కావలసిన సరుకు యితర రాష్ట్రాలకురవాణా చేయుటద్వారా విడుదల చేసుకోడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం మిల్లుల యజమానులకు "డి" ఫారం సర్టిఫికెట్లు యిచ్చే యేర్పాట్లు చేస్తున్నదని యిదివరకు భారత వస్తువుల చట్టంనుంచి ధరలను బట్టి యీ విధమైన సదుపాయాలు లేవని యీమాదిరిగాసాగే వ్యాపారానికి అమ్మకం పన్ను విధించబడుతుందని, డి ఫారం సర్టిఫికెట్లు అమలులో లేనప్పుడు ఐచ్ఛికంగా ధాన్యం అమ్మేవారినుంచి వస్తు చట్టం ప్రకారం అమ్మిన మొత్తంలో 7 శాతం అమ్మకం పన్ను వసూలుచేయటం జరిగేదని మంత్రి శ్రీ రామచంద్రారెడ్డి వివరించారు.

భాండసరినుంచి రాష్ట్రం బయట ప్రాంతాలకు సాగే వస్తురవాణాపై ఆంక్షలు విధించటం జరిగిందని శ్రీ వందేమాతరం రామచంద్రరావుకు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తెలియచేశారు. దీనిని గురించి ఆ ప్రాంతానికి చెందిన పంచదార వ్యాపారులు రాష్ట్రప్రభుత్వానికి పంపుకొన్న విజ్ఞప్తుల దృష్ట్యా అక్కడ దొరికే పంచదారను ఎగుమతి చేయుటకు వీలుగా పర్మిట్లు యివ్వవలసిందని సిఫారసు చేయటం జరిగిందని కేంద్రప్రభుత్వం నుంచి వచ్చేవర్తమానంకొరకు ఎదురు చూస్తున్నట్లున్నూ ఆయన చెప్పిన సమాధానంలో వివరిస్తూ పంచదార నిల్వల సరుకు తరలింపునకు కేంద్ర ప్రభుత్వం దేశమంతటికి ఒకే విధమైన కంట్రోలుఅమలుపరుస్తున్నదని జమ్ము కాశ్మీరు, పాండిచేరి ప్రాంతాలకు కంట్రోలు వర్తింపచేయబడలేదని వ్యవసాయ మంత్రి వెల్లడిస్తూ భాండసరిచక్కెరపై పెట్టిన ఆంక్షలు దానిని ఉత్తర ప్రదేశుకు పంపేవిషయంలో వర్తించవని అన్నారు.

శ్రీ ఎస్. కాసిరెడ్డికి రాష్ట్ర లఘు పరిశ్రమలమంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ ఇచ్చిన సమాధానంలో తృతీయ ప్రణాళికాకాలంలో చేనేతపరిశ్రమకు రు. 750.17 లక్షలు కేటాయించవలసిందని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని ఆమొత్తంతో యీపరిశ్రమను అభివృద్ధిచేయాలని సంకల్పించిందని, కేంద్రప్రభుత్వం దీనికై వచ్చే ప్రణాళికలో రు. 580 లక్షలు మాత్రం కేటాయించిందని చెప్పారు.

తృతీయ ప్రణాళికలో 3 గడియారాల ఫ్యాక్టరీలు

ఒకటి ప్రభుత్వ రంగమున రెండు ప్రయివేటు రంగమున, నెలకొల్పనున్నట్లు శ్రీ షా వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 5

దేశములో తృతీయ ప్రణాళికా కాలమున ప్రయివేటు రంగమున మరో రెండు చేతిగడియారాల ఫ్యాక్టరీలు స్థాపించబడగలవని నిన్న ఇచట గడియారాబాద్‌లో మొట్టమొదటి అలారము గడియారాల ఫ్యాక్టరికి ప్రారంభోత్సవము జరుపుతూ కేంద్రమంత్రి శ్రీ మనూభాయి షా చెప్పారు. బెంగుళూరులో ప్రభుత్వ పక్షాన స్థాపింపబడు ఫ్యాక్టరీ కాక ఈ రెండు స్థాపింపబడగలవు. వీటిలో ఒకటి బొంబాయిలోను, రెండవది కూనూరులోను నెలకొల్పబడగలవు.

ప్రభుత్వం దేశాన్ని దివాలా తీయిస్తున్నదట

ఆర్థిక విధానాలు లోపభూయిష్టంగాఉన్నాయని రాజాజీ విమర్శ

న్యూఢిల్లీ, మార్చి 5

ప్రభుత్వ ఆర్థిక విధానాలు దేశప్రజల అధోగతికి ఈడ్చుకొని పోతున్నాయని స్వతంత్రపార్టి నాయకుడు శ్రీ సి. రాజగోపాలాచారి ఇక్కడ విమర్శించారు.

భారత రాజధాని నగరంలో తమ పార్టీ ఎన్నికల ప్రచార ఉద్యమాన్ని ప్రారంభిస్తూ 1961-62 బడ్జెట్ ప్రతిపాదనల తీవ్రంగా విమర్శించారు. పేదప్రజలపై ప్రభుత్వం రు. 60 కోట్ల పన్నులు అదనముగావేసి పిండదలుస్తున్నదని ఈ పన్నులు మంచివికావని అన్నారు. ప్రభుత్వం అమలుపరచే అన్నిప్లానులు తప్పుతోవన నడుస్తున్నందున ఇప్పుడు ఇట్టి పన్నులు వేయబడుతున్నవని ప్రపంచపు అన్నిదేశాల నుండి ప్రభుత్వఋణాలు తెచ్చిమనను ప్రపంచంముందు దివాలాకోరులుగా చేస్తున్నదని తెచ్చేఅప్పులు ఎలాతీర్చే విషయమై ప్రభుత్వానికి సరియైన ప్లానులులేవనిశ్రీ సి. రాజగోపాలాచారి అన్నారు.

ఏప్రిల్ 1 నుంచి కరీంనగర్‌లో ఆక్ట్రాయి పన్ను అమలు

పురపాలకసంఘ నిర్ణయం

కరీంనగర్, మార్చి 5

ఏప్రిల్ 1వ తేదీనుంచి కరీంనగరు మున్సిపాలిటీ తన సరిహద్దులలో తక్ట్రాయ్ పన్ను అమలు చేయుటకు ఆన ప్రాంతములో సాగు చేయబడుతున్న భూములపై ప్రత్యేకముగా వ్యవసాయపన్ను వసూలు చేయుటకు నిశ్చయించింది. ఇంకా మునిసిపల్ అధీన ప్రాంతాలలోని ఖాళీస్థలాలపైన కూడా పన్ను విధించుటకు నిర్ణయం తీసుకొన్నది.

ప్రధాని నెహ్రూతో శ్రీ బ్రహ్మానందరెడ్డి, రాజు సమావేశము

కొత్తఢిల్లీ, మార్చి 5

ఆంధ్రప్రదేశ్ మంత్రులు బ్రహ్మానందరెడ్డి, పి. వి. జి. రాజు గారలు ప్రధాని నెహ్రూతో 40 నిముషాలు సమావేశమై శ్రీ సంజీవయ్య మంత్రివర్గాన్ని పడగొట్టడానికి ప్రతిపక్షం వారు కాంగ్రెస్ సభ్యులలో ఒకవర్గం వారు సమష్టిగా ప్రయత్నిస్తుండటాన్ని వివరించారు.

నిన్న యిక్కడికి వచ్చిన వీరు నేటి ఉదయం కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డిని కలిశారు. రేపు వీరు హైద్రాబాద్‌కు వెళ్ళుతున్నారు.

నెహ్రూతో సమావేశానంతరం శ్రీ బ్రహ్మానందరెడ్డిని ఒక రిపోర్టర్ కలుసుకోగా ఆంధ్రపరిస్థితిని ప్రధానికి వివరించామన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ ప్రతినిధి ఒకరు ఆంధ్రప్రదేశ్ వ్యవహారం చాలా స్వల్పమైనదని సులభముగా సవరింపబడగలదని అన్నారు.

హైద్రాబాద్, మార్చి 5

ఎక్కువగా ఆవుపాల ఉత్పత్తికై నాణ్యమైన ఆవుల రకాల పెంపొందించాలని కేంద్ర వ్యవసాయ ఉపమంత్రి శ్రీ ఎమ్. వి. కృష్ణప్ప పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గోసంవర్ధన సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేస్తూ శ్రీ కృష్ణప్ప ఆవుపాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఒక్క బెంగ్లూర్‌లో మినహా ఎక్కడా ఆవుపాలు పెద్ద మొత్తంలో దొరుకవని బెంగ్లూర్‌లో 90 శాతం ఆవుపాలే లభిస్తాయన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి దేశ పశుసంపదను అభివృద్ధిపరచవలసిన ఆవశ్యకతను వివరించారు.

కాంగ్రెస్ సభ్యుల ప్రసంగాల 'టేప్‌రికార్డర్లు' ఢిల్లీకి చేరవేత

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుని నిర్ణయం

హైద్రాబాద్, మార్చి 5

ఆంధ్రప్రదేశ్ శాసనసభలోని కాంగ్రెస్ సభ్యులు కొందరు ప్రస్తుత బడ్జెటు సమావేశమందు చర్చలలో బహిరంగంగా తమ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించడం తీవ్రమైన ప్రసంగాలతో యెదుర్కొటం గురించి రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ మల్లిపూడి వళ్ళంరాజు అసంతృప్తిని ప్రకటిస్తూ యిది అశోభనీయమైనదని పేర్కొన్నారు.

రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ వళ్ళంరాజు విలేకరులతో మాట్లాడుతూ యీ ఉపన్యాసాలను కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ నీలం సంజీవరెడ్డి దృష్టిలో పెట్టవలసిన బాధ్యత తనదేనని యిది అన్నీ ప్రధాని శ్రీ నెహ్రూ హైద్రాబాదులో శాసనసభ్యులకు హితవు చెప్పిన తర్వాత జరిగినదేనని ఆయన కాంగ్రెసు పక్షానికి చెందిన సభ్యులు ప్రభుత్వాన్ని పార్టీని యింటా బయటా విమర్శించరాదని హితవు చెప్పారని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని దుయ్యవడుతూ ఉపన్యసించిన వ్యక్తులలో మాజీమంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి, శ్రీ జగన్నాథరాజు ప్రభృతులు కలరు.

శ్రీ వళ్ళంరాజు తన నివేదికలో అసెంబ్లీలో సభ్యులు యిచ్చిన ఉపన్యాసాల టేప్‌రికార్డర్‌లను కలిపి కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డికి పంపుతారని తెలుస్తున్నది.

వివాహాది శుభ కార్యముల కొరకు
నూతన రకములలో
బనారస్
బ్రోకేడ్, టిస్యూ, కతాన్, జరీ బూటాలలో
మరియు
కంచి, ధర్మవర

జర్మన్ ఫిల్ములు

చలనచిత్రాలు లేకపోతే ఫిల్ములు చూడడంవల్ల బాలబాలికల లేతమనస్సులపై చాటిప్రభావం ఎన్నైనా ఉంటుందనడం నిర్వివాదాంశం. అసుచితమైన అవినీతికరమైన సంఘవిద్రోహకరమైన భావాలకు దారితీసే ఫిల్ములనీ వారి వయఃపరిమితికి అనుగుణంకాని ఫిల్ములనీ చూడడంవల్ల దేశంలో ముఖ్యంగా బొంబాయి ఢిల్లీ కలకత్తా వంటి నగరాలలో బాలబాలికలలో నేరప్రవృత్తి శౌల్యం పెరుగుతోందనీ నైతికదౌర్బల్యం క్రమశిక్షణ తగ్గిస్తోందనీ తల్లిదండ్రులు సాంఘిక సంక్షేమ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. బాలబాలికలుమాత్రమే కాం పెద్దవారుకూడా ఫిల్ములలో భావాలకు గురికాయి అసహజమైన ప్రవర్తనపాలవుతున్నారని తెలుస్తోంది.

ఈ ప్రమాదాలను తొలగించి దేశాభ్యుదయానికోడ్పడేవిధంగా ఫిల్ముల సంస్కరించవల్సిన అవశ్యకతగురించి ఎందరెందరో ఎన్నెన్నో సూచనలు చేస్తున్నారు. ఫిల్ముల నైతిక ధోరణి పెంచి పెంపొందించి వాటిని వైజ్ఞానికాభివృద్ధికి విద్యాభివృద్ధికి ఆరోగ్యకరమైన వినోదానికి తోడ్పడేవిగా చేయాలని, ఎన్నో ఆలోచనలు జరుగుతున్నాయి. ఈలక్ష్యం, యీఆదర్శం, కట్టుదిట్టంగా సాధించడానికి ఒక్కటే మార్గం గోచరిస్తోంది. ఫిల్మునిర్మాతలే తమంతటతాము ఫిల్ముల దుష్ఫలితాలు తొలగించటానికి నడుంకట్టి తమ ఫిల్ములను తామే కట్టుదిట్టంగా "సెన్సారు" చేయాలి. ఈపద్ధతిని పశ్చిమ జర్మనీలో ఎంతో విజయవంతంగా అమలుజరిపి సత్ఫలితాలు సాధిస్తున్నారు. నేడు ప్రపంచములో ఫిల్ములు ఎక్కువగా ఉత్పత్తిచేసే దేశాలలో భారతదేశం రెండవస్థానమో, మూడవస్థానమో ఆక్రమిస్తోంది. అందుచేత ఫిల్ముల దుష్ఫలితాలు తొలగించి వాటిని దేశాభ్యుదయానికి విద్యాభివృద్ధికి తోడ్పడే వాటినిగా రూపొందించవల్సిన అవశ్యకత ఎంతైనా వుంది. ఈ సందర్భంలో ఫిల్ముసెన్సారు బోర్డువారు అఖండమైన కృషిచేస్తున్నా అదిచాలదని అనిపిస్తోంది.

ఇక పశ్చిమజర్మనీలో అనుసరిస్తున్న స్వచ్ఛంద ఫిల్ము సెన్సారుపద్ధతిబాగోగులగురించి రవంత పరిశీలిద్దాం జర్మనీ, హిట్లరు పాలనక్రింద ఉన్న రోజులలో ఫిల్ములకి ప్రజలపైగల ప్రభావం గుర్తించి ఫిల్ములని పూర్తిగా ప్రభుత్వపు నిరంకుశ యాజమాన్యం క్రిందికి తీసుకువచ్చాడు. యుద్ధానంతరం, పునర్నిర్మాణ సమయంలో, ఫిల్ము నిర్మాతలు, ప్రభుత్వపు నిరంకుశ యాజమాన్యం, సెన్సారు పిప్పు తొలగించి, తమంతతామే ఫిల్ములని సెన్సారు చేసుకునే పద్ధతి ప్రవేశపెట్టారు. 1945-49 సంవత్సరాలమధ్య మిత్రరాజ్యాలు అంటే, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, సోవియట్ యూనియన్లు, ఆదేశాన్ని తమ పాలిత ప్రాంతాల క్రింద విభజించుకోవడం, తమ తమ విధానాలని ప్రవేశపెట్టడం జరిగింది. ఆతర్వాత జర్మనీ సమైక్యయత్నం ఫలితంగాఅమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు దేశాల పాలన క్రిందున్న ప్రాంతాలు ఫెడరల్ రిపబ్లిక్ లేక పశ్చిమ జర్మనీగానూ సోవియటు ఆక్రమిత ప్రాంతం జర్మను డెమాక్రాటిక్ రిపబ్లికుగానూ రూపొందాయి.

వీటిలో పశ్చిమజర్మనీలోని ఫిల్ము పరిశ్రమ ప్రజాస్వామ్య పద్ధతులలో ప్రయివేటువ్యక్తుల నిర్వహణక్రింద జరుగుతోంది. సోవియటు ఆక్రమిత ప్రాంతంలో ఫిల్ముపరిశ్రమ యింకా ప్రభుత్వపు కంట్రోలు క్రిందేవుంది. పశ్చిమజర్మనీలో ఫిల్మునిర్మాతలు పరిశ్రమల బాధ్యత స్వీకరించినప్పుడే చలనచిత్రపరిశ్రమకంతటికీ కలిసి ఒక ఉన్నత కార్య నిర్వాహక వ్యవస్థ ఏర్పాటుచేశారు. దీనిలో సభ్యులందరు నిర్దిష్టమైన కొన్నిసూత్రాలనీ పద్ధతులనీ అనుసరించి తమ ఫిల్ములని తామే సెన్సారు చేసుకోడానికి అంగీకరించారు. వారందరూ అనుసరించిన సూత్రాల ననుసరించి ఫిల్ములలో యుద్ధాలని ప్రస్తుతించకూడదనీ అవినీతికరంగా ఉండకూడదనీ మానవహక్కుల నతిక్రమించేవిగా ఉండకూడదనీ ఉద్రిక్తభావాలు కల్గచేసేవిగా ఉండకూడదనీనిశ్చయించారు. ఫిల్ముల ఎడ్వర్టైజుమెంటుకి విడుదలచేసే ఫోటోలని పోస్టర్లని కూడా వారు పరీక్షించాలని నిశ్చయించారు.

ఇక యీస్వచ్ఛంద సెన్సారింగు విధానంక్రింద పని ఎలా జరుగుతుందో చూడండి. ఏఫిల్ములోనయినా కొన్నిభాగాలు పైసూత్రాలనిగనుక అతిక్రమించినట్లయితే ఫిల్మునిర్మాత వాటిని మార్చడంగాని పూర్తిగాతొలగించడం కానిచేయాలి. ఫిల్ముసెన్సారింగు చేయడానికి కంపెనీలు స్వచ్ఛందంగా ఏర్పాటుచేసుకున్న సంస్థలో ఫిల్ముకంపెనీలకి సంబంధించిన వ్యక్తులెవరూ వుండరు. ఈవ్యవస్థ నిర్ణయంగనుక ఫిల్మునిర్మాతలకి నచ్చకపోతే వారు మరొకవ్యవస్థకి అప్పీలు చేసుకోవచ్చు. ఈ రెండవ సంఘంకూడా ఆభావాలు అవినీతికరంగాగాని ఉత్తేజభావాలు కల్గించేవిగాగాని ఉన్నా పరిశీలించి తీర్పు చెబితే ఆ భాగాలు మార్చుచేసుకతప్పదు. వారిపై మీదనే జీవితాలు వెళ్ళదీస్తున్నారు కూడా అప్పీలుచేసుకోడానికి అవకాశము ఉందికాని సాధారణముగాఅంత పరకూ వెళ్లవల్సిన ఆవశ్యకతవుండదు.

ఫిల్ము సెన్సారు సంస్థలో ప్రభుత్వంగుర్తించిన రాజకీయ పక్షాలకి చెందిన వ్యక్తులూ కార్మికసంఘాల సభ్యులూ యువజన సంస్థల సభ్యులూ మతసంస్థలకి చెందినవారు సభ్యులుగా వుంటారు. వీరుకాక వృత్తిరీత్యా ప్రత్యేకానుభవంకల్గిన కొందరు వ్యక్తులనుకూడా ఫిల్ముల యొక్క నైతిక ఆర్థిక అముష్మిక విలువల పరిశీలించడానికినియమిస్తారు. ఇటువంటివారిని సాధారణంగా పత్రికావిలేఖరులనుంచీ విజ్ఞానవేత్తలనుంచీ సంస్కృతిరంగములో ప్రముఖులనుంచీ ఎన్నుకోవడము జరుగుతుంది.

ఈస్వచ్ఛంద సెన్సారింగు విధానం యీమధ్యకాలంలో యువకులకోసం విడుదలచేసేఫిల్ములవిషయంలో చాలా కట్టుదిట్టంగా అమలుజరుపుతున్నారు. యువకులకి అనుకూలమైన ఫిల్ములు విడుదలచేయడానికిది తోడ్పడుతోంది. ఇతర ఫిల్ములవిషయంలోకూడా యిది చాలా విజయవంతంగా అమలుజరుగుతోంది.

ఇది ఒకరకమైన ఆత్మపరీక్ష కావడముచేతనూ స్వచ్ఛందమైనది కావడంచేతనూ ఇది సాధారణ జీవితాభివృద్ధికి తోడ్పడుతోంది. ఇటువంటివిధానాన్ని మనదేశంలో పారిశ్రామికులుకూడా అనుసరిస్తే బాగుంటుందేమో!

-ఇంట్రా.

వింతలు, విశేషాలు :-

స్వంతమోటారుకార్లలో టెలిఫోన్ సౌకర్యం

జర్మన్ ఫెడరల్ పోస్టాఫీసువారు ముఖ్యంగా వర్తకులకోసం, కంపెనీల కోసం ఒకకొత్తరకం టెలిఫోన్ విధానము ప్రవేశపెట్టారు. దీనివలన జర్మనీలో టెలిఫోన్ ఉన్నవారిలో యీ కొత్తరకం రేడియో టెలిఫోన్ సౌకర్యము కలిగినవారు నగరంలో ప్రయాణముచేసే కార్లలోనుంచిగాని, లేదా రేవులలోఉన్న ఓడలలో నుంచి గాని లేదా దేశంలో శీఘ్రగతిలో నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్ళనుంచి గాని సంభాషణలు జరపడానికి వీలవుతుంది.

ఈ రేడియో టెలిఫోన్ పద్ధతి మొదట ప్రవేశపెట్టబడినప్పుడు చాలా కొద్దిమంది దీనిని ఉపయోగించారు. కాని క్రమేణా యిది ప్రాచుర్యము లోనికి వచ్చింది. 1951 వ సంవత్సరం నవంబరు నెలలో దీనిని హేంబర్గు నగరములో ప్రారంభ చర్యగా ప్రవేశపెట్టినప్పుడు ఇద్దరు మాత్రమే యీ కొత్త పరికరాలను వాడారు. 1955 జనవరి నాటికి 71 మంది దీనిని ఉపయోగించారు. అంటే సుమారు నెలకి పదివేలసార్లు వీటి ద్వారా సంభాషణలు జరిగాయి. నేడు జర్మనీలో ఈ రేడియో టెలిఫోన్ సౌకర్యం 650 మంది వాడుతున్నారు. గత ఏప్రిల్ నెలలో 62,385 సంభాషణలు జరిగాయి. దేశంలోవల వివిధ నగరాలలోనూ పనిచేసే యీ రేడియో టెలిఫోను పద్ధతిని అధికారులు క్రమేణా అభివృద్ధి పరుస్తున్నారు. మొదట ఇది మూడు ఉత్తర జర్మన్ నగరాలలో మాత్రమే ఉండేది. నేడిది 25 నగరాలలో అమలులో ఉంది. అందుచేత నేడు తన కారులో ఈ పరికరముగల వారు 25 నగరాలలో ఉన్న వారితో టెలిఫోనులో మాట్లాడడానికి వీలుంటుంది.

ఇతరగ్రహాలపై జీవరాశి

మాస్కో, మార్చి 5

సోవియట్ దేశం స్వయం చలనక అంతర్గ్రహ రాకెటును పంపిన శుక్రగ్రహం లోనూ ఇతరగ్రహాలలోనూ జీవరాశి ఉండవచ్చునని ప్రఖ్యాతసోవియటు విజ్ఞానశాస్త్రవేత్త ఎకాడమీషియన్ వాలెంటిన్ కార్గిన్ "టాస్" విలేఖరితో మాట్లాడుతూ అన్నారు.

ఇతర గ్రహాలపైన ఉండే జీవరాశి మాంసకృత్తి రహితంగా ఉండవచ్చుననీ, యెందువల్లనంటే సేంద్రియ మిశ్రమ పదార్థాల ప్రపంచములో భూమండలంపైన ఉన్నటువంటి జీవరాశి మాత్రమే ఉండనవసరంలేదనీ ఆయన అభిప్రాయపడినారు.

ఇతర గ్రహాలను గురించి తెలుసుకోవడానికి సోవియట్ దేశం జరుపుతున్న పరిశోధనలు జీవశాస్త్రజ్ఞులు జీవరాశికి సంబంధించిన విషయాలను మరింత యెక్కువగా తెలుసుకొనడానికి తోడ్పడతాయని ఎకడమీషియన్ కార్గిన్ అన్నారు.

దక్షిణ కొరియాలో ఆహార కొరత

సియోల్, మార్చి 5

చుల్లారాష్ట్రం మరియు ఉల్‌రంగ్ ద్వీపంలోని అయిదులక్షల రైతులు తుడ్పాధతో తమ పంటలు గడుపుతున్నారు.

విరు ఇప్పుడు కేవలం జొన్న జావ మీదనే జీవితాలు వెళ్ళదీస్తున్నారు

ద్విసభ్య నియోజక వర్గాల రద్దుబిల్లు

కొత్తఢిల్లీ, మార్చి 5

రాజ్యసభ దేశంలో గలద్విసభ్య నియోజకవర్గాల రద్దుకు 1962లో జరిగే ఎన్నికలు ఏకసభ్య నియోజకవర్గ ప్రాతిపదికపై జరిగే బిల్లును ఆమోదించినది ఈబిల్లులోక సభ ఈవరకే ఆమోదించినది.

సమితి సైనికులచే బనానా నౌకాశ్రయం ఖాళీ

లియోపాల్డువిల్లి, మార్చి 5

కాంగో నది ముఖద్వారం వద్దగల బనానా నౌకా కేంద్రాన్ని సమితి యొక్క ఘానా సైనికులు ఖాళీ చేసేలా కాంగో సైనికులు చేశారని సమితి బలాలపై పిరంగులతో కాల్పులు జరిపారని తెలుస్తున్నది బనానాకు సమీపంలోగల కటోనా విమానాశ్రయమును ఖాళీచేయకుండా ఉండటానికి సమితివర్గాలు ఇండోనీషియా సైనికులను పంపినది.

చైనా గార్డెన్సులో కేరళ కళా మండల సంస్థచే నృత్య ప్రదర్శనాలు

హైద్రాబాద్, మార్చి 5

కేరళ కళామండల బృందము, చైనీస్ గార్డెన్స్‌లో యీ నెల 6 తేదీన ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యాన భరత నాట్య ప్రదర్శనాలివ్వడానికి హైద్రాబాదు చేరింది అంతర్రాష్ట్రీయ సాంస్కృతిక సంస్థలు ఒకదానికొకటి పరిచయము చేసుకొంటాయనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వము యీ ప్రదర్శనాల పథకాన్ని రూపొందించింది

కేరళ కళాకారులకు చెందిన యీ బృందములో 26మంది గురు మహిళలతో కలుపుకొని) సభ్యులున్నారు

రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ నిన్న సాయంత్రము జూబిలీ హాలులో యేర్పాటు చేసిన అల్పాహార విందులో పత్రికా ప్రతినిధులు కళాకారులను కలుసుకొనుటకు వీలు కలిగింది.

మండల బృందమునకు చెందిన కార్యదర్శి ఒక మాజీ డిప్యూటీ కలెక్టరు. ఆయన కళాకారులను విలేఖరులకు పరిచయంచేసి సంస్థ చరిత్రను వివరించారు. ఆయన చేసిన వివరణలో మలయాళంలో ప్రముఖకవి శ్రీ వల్లతోల్ నృత్యములో కథావళి విధానాన్ని పోత్సహించే ఉద్దేశ్యముతో దీనిని నెలకొల్పారని యీ సంస్థను కేరళ ప్రభుత్వం సబ్సిడీ యిస్తున్నదని ఆ ధనసహాయంతో అక్కడ ఒక శిక్షణా కేంద్రం నిర్వహించబడుచున్నదని చెపుతూ దీని ఆధ్వర్యాన ఇండోనీషియా, జపాన్, మొదలైన వివిధ ప్రాంతాలలో నృత్య ప్రదర్శనాలు యివ్వడానికి వెళ్ళవలసినట్లు వెల్లడించారు.

ప్రస్తుత భారతదేశంలోనిపలుప్రాంతాలలో పర్యటిస్తూ వున్నదని ఆయన చెప్పి యిక్కడ యివ్వబోతున్న ప్రదర్శనలలో చేర్చిన నృత్య అంశాలను పేర్కొన్నారు.

రాష్ట్రాల అభివృద్ధి కార్యకలాపాల ప్రచారానికి టెలివిజను వినియోగం

న్యూఢిల్లీ, మార్చి 5

ప్రస్తుతం టెలివిజను ఢిల్లీలోనే అదైనా ప్రయోగాత్మకంగా నిర్వహింపబడుతోంది గనుక వివిధరాష్ట్రాలలో సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారంచేసే నిమిత్తం యీ సాధనాన్ని వినియోగించడం ప్రస్తుతసాధ్యంకాదనీ, అయినాకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ఇక్కడ ప్రయోగాత్మక కార్యక్రమాలలో టెలివిజను ద్వారా ప్రదర్శించడం జరుగుతోందనీ, రేడియో సమాచార మంత్రి డాక్టరు బి. వి. కేస్కర్ రాజ్యసభలో శ్రీ బి. ఎస్. భార్గవ అడిగిన ఒకప్రశ్నకు లిఖితంగా ప్రత్యుత్తరం ఇస్తూ తెలియజేశారు

సెంట్రల్ ఇన్ఫర్మేషను సర్వీసు

2 వ, 4 వ గ్రేడులలో కొన్ని ఖాళీలు మినహా సెంట్రల్ ఇన్ఫర్మేషను సర్వీసు ప్రాథమికదశ నిర్మాణం పూర్తి అయిందనీ, పై ఖాళీలకు ఉద్యోగులను నేరుగా నియమించనవి యీనియను పబ్లిక్ సర్వీసు కమిషనుకు అప్పగించడం జరిగిందనీ అన్ని గ్రేడులలో కలుపుకుని సెంట్రల్ ఇన్ఫర్మేషన్ సర్వీసుకు మంజూరుఅయిన మొత్తం సిబ్బంది సంఖ్య 612 అనీ. రేడియో సమాచార మంత్రి డాక్టరు బి. వి. కేస్కర్ రాజ్యసభలో శ్రీ ఎమ్ పి. భార్గవ అడిగిన ఒకప్రశ్నకు జవాబుగా తెలియజేశారు.

మార్చి 6వ తేదీ సాయంత్రం సుల్తాన్ బజారులోని వై.యం.ఐ.ఎస్. లో జరిగే శ్రీరామ కృష్ణ జయంతి ఉత్సవ సభకు ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ పి. వి. జి. రాజు అధ్యక్షత వహిస్తారు స్వామి స్వాహానంద్‌జీ ప్రసంగిస్తారు.

పశ్చిమ జర్మనీలో వైద్య సౌకర్యాలు

భారతీయ డాక్టర్ డి.ఎస్. మెహరా అభిప్రాయాలు

(లోగడ బెర్లిన్‌నగరంలో జరిగిన ప్రపంచ వైద్యసంఘపు వార్షిక సమావేశానికి హాజరయిన 61 మంది భారతీయ వైద్యులలోనూ, ఢిల్లీలో క్షయవ్యాధి నిపుణులయిన డాక్టర్ మెహరా ఒకరు. వీరిలో 13 గురు మహిళలు కూడా ఉన్నారు. వీరంతా 12 రోజులపాటు జర్మనీలో పర్యటించి ఆదేశంలోగల ఆస్పత్రి సౌకర్యాలు పరిశీలించారు.)

ఒకరోగి అపరేషన్ బల్లమీద ప్రశాంతముగా పడుకొని ఉన్నాడు. వైద్యుడు రోగిఊపిరితిత్తులవద్ద కోసి, ఊపిరితిత్తిలో అనుమానముగా ఉన్న ఒక చోట చిన్నముక్కకోసి లేబొరేటరికి పంపాడు. అతడింకా అనుమానముగా ఉన్న భాగాన్ని పరిశీలిస్తుండగానే లేబొరేటరీ వారాముక్కని పరీక్షించి, పదినిముషాలలోపుగానే దానిని గురించిన నివేదిక సర్జన్‌కు అందజేశారు. కొద్దివారాలక్రితం ఊపిరితిత్తుల రోగాలు కుదిర్చే ఒక బెర్లిన్ ఆసుపత్రిలో నేను చూసిన సంఘటన ఇది. జర్మనీలో ఆస్పత్రి సౌకర్యాలు ఎంతకట్టుదిట్టంగా జరుగుతున్నదీ చూపించడానికి ఇది ఒక చక్కని నిదర్శనం.

ఆ రోగి విషయంలో అతడు క్షయవ్యాధితో బాధపడుతున్నాడో లేక "లంగ్ కేన్సర్" తో బాధపడుతున్నాడో అన్న సంగతి గురించి డాక్టర్లు తెలుసుకోవడం కోసం ఆ అపరేషన్ చేశారు.

లేబొరేటరీ నివేదికగాని అతి త్వరిత గతిలో అందకపోతే అపరేషన్ నిష్ప్రయోజన మవుతుంది. ఊపిరితిత్తులలో కేన్సర్ అని తెలిస్తే వారాభాగములో శస్త్రచికిత్స చేయవలసి వుంటుంది. ఇాగా నివేదికలో కేన్సర్ సూచనలు ఏవీలేవని చెప్పడము చేత డాక్టర్ తిరిగి ఊపిరితిత్తి కుట్టివేసి క్షయవ్యాధి నివారణకు మందులు యిచ్చారు. అంతత్వరితకాలంలో లేబొరేటరీ పరీక్ష జరపగలిగారంటే అది వారి అత్యుత్తమశక్తి సామర్థ్యాలు నిరూపిస్తోంది.

మా డాక్టర్ల బృందం ఆతర్వాత హైడెల్‌బర్గు విశ్వవిద్యాలయములో ఉన్న ప్రత్యేకవ్యాధుల ఆస్పత్రి సందర్శించాము. ఈ ఆసుపత్రిలో అనేక రకాల కొత్తకొత్త వ్యాధుల చికిత్సలకి వీలుకలిగే నూతన పరికరాలెన్నో ఏర్పాటు చేశారు. మా బృందములో ఉన్న ఆడడాక్టర్లు బెర్లిన్‌లోనిచార్లట్‌టన్ బర్గు జిల్లాలోఉన్న మహిళా శిక్షణ వార్డులోగల మహిళా శిక్షణ వైద్యశాల ఒకటి చూశారు. జర్మనీ అంతటిలోనూ యిది చాలా పేరు ప్రసిద్ధిపొందిన ఆస్పత్రి. దీనిలో 150 మంది పురుడు పోసుకోవడం కోసము 50 మంది పిల్లల వైద్యముకోసం సౌకర్యాలు ఉన్నాయి. పురుటి సమయములో ఎప్పటికప్పుడు ప్రసవవుగతి తెల్సుకోడానికి వీలయిన ఎన్నో ఆధునిక పరికరాలు ఈఆస్పత్రిలోఉన్నాయి వైద్య విద్యార్థులకు, ప్రదర్శనలకి కూడా తగు సౌకర్యాలు ఉన్నాయి. శిశువులని ఉంచే వార్డులలో మామూలుగా వచ్చే అంటువ్యాధులు ఏవీ సోకకుండా తగు ఏర్పాట్లు చేశారు.

పశ్చిమ జర్మనీలో ఆస్పత్రులను చాలా ఉపయోగకరమయిన పద్ధతిలో ఏర్పాటు చేశారు. ఆస్పత్రులేర్పాటు చేసేటప్పుడే వారు, వైద్య సౌకర్యాలకి, వైద్య విద్యాబోధనకి సమగ్రమయిన సంబంధం ఉండేలా ఏర్పాట్లు చేశారు. దీనివలన వైద్య విద్యార్థులు నిపుణులు చేసే అపరేషన్లు, వారను సరించే వైద్యవిధానం తెలుసుకోడానికి వీలవుతుంది.

ఉదాహరణకు శ్వాస నాళానికి సంబంధించిన అపరేషన్ ఒకటి నేను చూశాను. అపరేషన్ ముందుగానే అపరేషన్ బల్లపైన ఒక రెమే రా యేర్పాటు చేశారు. అపరేషన్ జరుగుతున్నంతసేపూ ఆ కెమెరా రంగులతో సహా ఫిల్ము తీసింది. ఆ ఫిల్ముని తక్షణం డెవలప్ చేయడానికి పంపారు. అపరేషన్ తరువాత కట్టుకట్టడంపూర్తి అయేలోగా ఫిల్ము తయారయి వచ్చినది. ముందు డాక్టర్లు చూశారు. ఆతరువాత దానిని విద్యార్థులకు ప్రదర్శించారు. అంతేకాకుండా ఏదయినా ఒక కొత్తసాంకేతిక పద్ధతి వైద్యవిద్యార్థులకు బోధించాలంటే విద్యార్థులు రోగిచుట్టు చేరి చూడనక్కర లేదు. ఒక మూల అపరేషన్ జరుగుతుండగానే టెలివిజన్ సహాయంతో విద్యార్థులు దానిని జాగ్రత్తగా చూడడానికి వీలవుతుంది. వీటి అన్నిటికన్నా నన్ను ఆకర్షించినది పశ్చిమ జర్మన్ ఆసుపత్రులలో ఆరోగ్య శిబిరాపథకపు కార్మికులయెడ చూపే శ్రద్ధ. ఈ పథకముక్రింద కార్మికులకోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రులు దేశంలో ఉన్న వాటిలో చాలాపెద్దవి. వీటిలో అతి ఆధునికమయిన పరికరాలు, చికిత్సా సౌకర్యాలు యేర్పాటు చేశారు.

మధిర తాలూకాలో కాపు సారా బెడద

తగ్గేంతవరకు శాంతి ఏర్పడదు

మధిర మార్చి 5

శ్రీ మారగాని మల్లేశం ఒక పత్రికా ప్రకటనలో యిలా తెలుపుతున్నారు:

మధిర తాలూకాలో కాపుసారాయి తయారుచేయటం అమ్మటం త్రాగటం త్రాగిన మత్తులో రోజుకొకచోటదెబ్బలాడటం ఆచారంగామారింది. కొన్ని మాసములనుండికొన్నిహత్యలుకూడా జరిగినవి. అనేకచోట్లరివెన్యూ పోలీసు అబ్కారీ అధికార్లపై తిరుగుబాట్లు కూడా జరిగినవి.

కాపు సారాయి తయారగుచున్న గ్రామాలరైతులు వ్యవసాయపనులకు కూలీలు దొరకక వ్యవసాయ పనిముట్లను కాపుసారాయి వండేబందుకు వంటచెరుకుక్రింద ఉపయోగించకుండా కాపాడలేక బాధలు పడుచున్నారు.

కాపుసారాయి త్రాగడం అనారోగ్యమన్న విషయమే మరచి పోతున్నారు. కాపుసారాయి తయారుచేసే వారు వివిధ విషతుల్యమైన పదార్థాలను ఉపయోగించటమే గాక, తొందరగా ఊట తయారుకావాలని ఊట బానల క్రింద దుర్గంధ పూతితమయిన పందిపేంటను కూడా ఉపయోగిస్తున్నారు.

ఆంధ్ర ప్రాంతములో మద్యపాన నిషేధచట్టము అమలులో పెట్టినప్పుడు నుండిమధిర బార్డర్ గ్రామాలలోకాపుసారాయి విపరీతముగా తయారగుచున్నది. మధిర తాలూకా బార్డర్ గ్రామాలలో తయారయిన సారాయి ఆంధ్రలో పలు ప్రాంతాలకు రోజుకు వందల గ్యాలన్‌ల చొప్పున సరఫరా అవుచున్నది. ప్రభుత్వంవారు మధిర తాలూకాలో ఉన్న కాపు సారాయి కేంద్రాలపై తగుచర్యలు తీసుకునేంతవరకు ఆంధ్రలో మద్యపాన నిషేధ చట్టము జయప్రదము కాజాలదన్నది నగ్నసత్యం.

మన జాతీయ ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా త్రాగుబోతుల సంఖ్య పెరుగుచున్నదేగాని తగ్గటం లేదు. ఇంటింట కాపుసారాయి తయారగుచున్నందువలన కుటుంబములోనివారు అంతా త్రాగుబోతులుగా తయారగుచున్నారు.

ప్రభుత్వాధికారులు తాలూకాలోకొన్ని గ్రామాలకు పోయి రావటానికి భయపడుచున్నారు. చట్టమన్నా ఆర్థరన్నా పాటించాలన్న భయము భక్తి లేకుండా పోయింది. అధికార్లమీదతిరుగుబాటుచేసిన కేసులు న్యాయస్థానములందు నడుస్తున్నాయి.

మధిర తాలూకా అబ్కారీ అదాయము సంవత్సరానికి కొంతతగ్గుతూ వస్తున్నది. యెందరో అబ్కారీవ్యాపారస్తులు నష్టపడిపోతున్నారు. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తెచ్చినా సరిఅయిన బలములేనిది కాపుసారాయి కేంద్రాలపై చర్యలు తీసుకోజాలమని అంటున్నారు.

ప్రభుత్వం వెంటనే జోక్యముకలుగజేసుకొని తాలూకా ప్రజల క్షేమము దృష్టియందుంచుకొని శాంతిభద్రతలు యేర్పడేంతవరకు దిగువ వ్రాయబడిన సహాయమును చేస్తుందనే విశ్వసించుచున్నాము.

1. అబ్కారీ అధికారులకు సహాయముగా యస్.ఆర్.పి. రిజర్వు పోలీసు దళాలను ప్రత్యేకంగామధిర తాలూకా సెంటర్‌లో నియమించాలి.

2. అబ్కారీ పై అధికారులు జిల్లా సెంటర్‌లలో ఉన్నట్లుగా అబ్కారీ సి.ఐ.డి. డిపార్టుమెంటును అధికంగా నియమించాలి.

3. మధిర సరిహద్దు గ్రామాలలో దాడులు చేసేటప్పుడు అధికారులు ఆంధ్రా తెలంగాణా అన్న విచక్షణ లేకుండా సమష్టిగా కృషిచేయాలి.

4. కాపు సారాయి కేసులు సంవత్సరాల తరబడి న్యాయస్థానాలందు నడుస్తున్నాయి. తొందరగా తీర్పులు చేయాలని ఆదేశాలను పంపాలి. లేదా ప్రత్యేక న్యాయస్థానాలను నియమించాలి.

5. ఆంధ్ర బార్డర్ గ్రామాలయందు ఉన్న నీరా సొసయిటీలను రద్దు చేయాలి. లేదానీరా నేగిసేట్టుగా ప్రొహిబిషన్ అధికారులు ప్రయత్నించాలి.

అంధులకు సహాయ పద్ధతులను వివరించే ప్రదర్శన

ఈయేడు భారత దేశానికి రాక

లండన్, మార్చి 5

బ్రిటన్‌లోఅంధులకుసహాయంఅరిగే పద్ధతులను వివరించే ప్రదర్శన ఒకటి ఈ యేడు భారత దేశానికి వస్తుంది. వచ్చే రెండు సంవత్సరాలలో యాభైకంటే ఎక్కువ దేశాలకు బ్రిటన్ నుంచి వెళ్ళనున్న ప్రదర్శనలలో ఇదొకటి. పన్నెండు ప్రదర్శనలను పంపించనున్నారు.

అంధుల సంక్షేమ సంస్థల సహాయంతో బ్రిటిష్ కౌన్సిల్ తయారు చేసినది. ఈ ప్రదర్శనలను అంధులకు స్వయం సహాయ విధానాలను నేర్పే పద్ధతులను చూపించే వంద ఫొటోలుంటవి ఒక్కొక్క ప్రదర్శనలో.

ఈ ప్రదర్శనలతో పాటు బ్రెయిలీలో ముద్రించిన పత్రికలనూ అంధుల సంక్షేమ కార్యకలాపాలలో పని చేసే అధికార, అనధికార ప్రచురణలనూ కూడాచూపిస్తారు.

చూపులేని వారి అభ్యున్నతికి ఏమి చేయవలసినదీ వివరించడం యీ ప్రదర్శన ఆశయము. ఇతరులకు కూడా కొంతలో కొంత ఆ శక్తి కలిగించుతుంది.

లండన్‌లో పాచ్య విద్యలకు ఇశోధిక సౌకర్యాలు

లండన్, మార్చి 5

లండన్ విశ్వవిద్యాలయంలోని ఆఫ్రికా ప్రాచ్యవిద్యాబోధన కేంద్రములోని గ్రంథాలయాన్ని పునర్వ్యవస్థీకరించి విస్తృతం చేయనున్నారు. ఈగ్రంథాలయంలో ఇప్పటికే 250000 ల గ్రంథాలున్నవి. పౌ.3,50,000 ల ఖర్చుతో యీవిస్తరణ కార్యక్రమం అమలు జరుపనున్నారు ఈ ఖర్చులో నాల్గోవంతు బాక్ ఫెల్లర్ సంస్థా, వాణిజ్యసంస్థలు పౌ 1.00,000 ఇవ్వనున్నవట.

శ్రీరామకృష్ణపరమహంస జయంత్యుత్సవాలు ప్రారంభం

నగర వివిధ ప్రాంతాలలో

హైదరాబాద్, మార్చి 5

శ్రీరామకృష్ణ పరమహంస 126వ వర్ధంత్యుత్సవాలు నిన్న నగరములో ప్రారంభమైనవి.

ఈ సందర్భములో మలక్‌పేట కాలనీలో జరిగిన సభకు మద్రాసు రామకృష్ణ మిషన్ అధ్యక్షులుస్వామి కైలాసానంద్‌జీ అధ్యక్షత వహించారు. స్వామి స్వాహానంద్‌జీ (వేదాంత కేసరి సంపాదకులు) శ్రీఎస్.సుబ్బారావు శ్రీరామకృష్ణుని జీవితము ఆయన బోధల విశిష్టతలను గురించి ప్రసంగించారు.

4వ తేదీ సాయంత్రము సికింద్రాబాదు మహబూబ్ కాలేజి ఆవరణలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన యేర్పాటు చేసిన సభలో స్వామి సత్యరూపానంద్ ఉపన్యాసము జరిగింది.

లులాబర్గులో మొబుటు సైనికుల అత్యాచారాలు

44 గురు సివిలియన్‌ల వధ

లియోపాల్డువిల్లి, మార్చి 4

లులాబర్గులో గత బుధవారం జరిగిన కొట్లాటలలో మొబుటు సైనికులచే 44 గురు కాంగో పౌరులు చంపబడినారని ఇక్కడి సమితి వర్గాలకు వర్తమానం చేరింది

లులాబర్గు ప్రజలు మరి గురు సైనికుల చంపి మరో మర్గురిని గాయపరచిన మీదట ప్రతీకార చర్యగా సైనికులు పట్టణంలో ఈవిధ్వంసాన్ని కల్పించారట. దాదాపు వెయ్యిమంది కాంగోలీ ప్రజలు అక్కడ సమితి అధికారుల రక్షణను కోరారు

నిజామాబాద్ ప్రాథమిక వైద్య కేంద్రం

ఒక పౌరుని భూరివిరాళం

నిజామాబాద్, మార్చి 5

రామ్‌సుఖ్ బాల్‌ముకుంద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు మద్నూరులో కలెక్టర్ శ్రీ దిల్‌సుఖ్ రాం ప్రారంభోత్సవము జరిపారు. భవన నిర్మాణము ఇంకా పూర్తికానందున ప్రస్తుతము యీ కేంద్రము ఒక గృహములో నెలకొల్పబడింది. శ్రీ బాల్‌ముకుంద్ భవన నిర్మాణమునకై 4 ఎకరముల భూమిని రు. 10 వేలను విరాళముగా ఇచ్చారు. కమ్యూనిటీ వర్క్‌షాప్‌నకు జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ హన్మంతరెడ్డి ప్రారంభోత్సవము చేశారు.

జిరాక్ పీట్ కోటా నోచుకోని జహీరాబాద్!

జహీరాబాద్, మార్చి 5

జహీరాబాద్ తాలూకా ప్రజలు జిరాక్ రేకులు దొరకక ఇబ్బందులకు గురి అవుతున్నారని గత రెండు సంవత్సరాలుగా యీ తాలూకాకు యీ కోటా లభించటంలేదని తెలుస్తున్నది.

పార్లమెంటులో ప్రశ్నోత్తరాలు:

విదేశాలలో హిందీ బోధన

న్యూఢిల్లీ, మార్చి 5

హిందీ భాషాభ్య

తూర్పుపాకిస్థాన్‌లో మతకలహాలు

సైద్‌పుట్‌లోఐదుగురి మృ

ఢక్కా, మార్చి 5

తూర్పుపాకిస్థాన్‌లోని రంగపూర్ జిల్లాలోని సైద్‌పుట్‌లో మార్చి 2 న జరిగిన కొట్లాటలలో నలుగురు చని పోయారు. ఢక్కాకు 250 మైళ్ళ దూరములోగల ఈపట్టణంలో ప్రస్తుతము కర్ఫ్యూ అమలులో ఉన్నది.

తగ్గించబడిన ధరలు
నూతన మెర్క్యురీ రేడియోలు,
6 వాల్వులు, రు. 355
ప్రత్యేక తగ్గింపు ధరలు
ఒక్కొక్కటి రు. 250/-
కొద్ది మాత్రమే మిగిలినవి
ఐ. ఆర్. పి. రేడియోలు
ఒక్కొక్కటి రు. 175 నుండి
లభించును.
కె. వరదరాజ బ్యాంక్ లేన్,
హైద్రాబాద్. ఫోన్: 5868.
సబ్ డీలర్లు: విజయ్ ఎలక్ట్రానిక్స్
కింగ్స్‌వే, సికింద్రాబాద్.

ఆకాశవాణి

హైద్రాబాదు-ఎ

మంగళవారం, మార్చి 7

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-40 భక్తి రంజని, 7-00 తె-వా, 7-15 విజయ వాడ వలె, 7-45 సంగీత శిక్షణ, 8-00 అం-వా, 8-15 హిం-వా, 8-30 విఠల్ రావు యెల్లప్పా జాధవ్, 8-45 ప్రసార సమాప్తి.

11-00 ఉన్నత పాఠశాలలకు 11-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం, 1-00 విఠల్ రావు యెల్లప్పాజాధవ్: 1-15 సుశీలా వ్యాపారి: గీత్, భజన్, 1-30 వార్తా గోష్ఠి, 1-50 తె-వా, 2-00 సుశీలా వ్యాపారి: గీత్, భజన్, 2-10 ఉ-వా, 2-20 ఉన్నత పాఠశాలలకు (ఉర్దూ), 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 కన్నడ శ్రోతలకు, 7-00 తె-వా 7-15 మరాటీ శ్రోతలకు, 7-30 సాహిత్యనందిని, 7-45 శ్రోతల ఉత్తరాలకు జవాబులు (ఉర్దూ), 7-55 ప్రసంగము (ఉర్దూ), 8-00 శ్రోతలు కోరిన పాటలు, 8-30 విఠల్ రావు యెల్లప్పా జాధవ్, 8-45 మాణిక్ వర్మతుమీ, 9-00 అం-వా, 9-15 ఉ-వా, 9-30 పాల్ సింగ్ రాగి, బృందం, 9-45 విఠల్ రావుయెల్లప్పా జాధవ్, 10-00 మాణిక్ వర్మ, 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

హాయిదరాబాదు-బి

49.02 మీ (6120 కిలోసై)

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎ వలె, 8-45 ప్రసార సమాప్తి.

11-00 హైదరాబాద్ ఎ వలె 11-30 ప్రసార సమాప్తి.

30.86మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైద్రాబాద్ ఎ వలె, 2-10 వయొలిన్, 2-20 వేణువు, 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥ 6-00 హైద్రాబాదు ఎ వలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 హైద్రాబాదు ఎ వలె, 7-45 రాగ లక్షణం, 8-00 హైద్రాబాద్ ఎ వలె, 9-15 ఎమ్. రాజగోపాల శర్మ, 9-30 హరికథ (విజయ వాడనుండి రిలే), 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30కుభోదయం, 6-40 భక్తి రంజని, 7-00 తె.వా, 7-15 పెనుగంచిప్రోలు పెద మస్తాన్ సాహెబ్: క్లారినెట్, 7-45 సంగీత శిక్షణ, 8-00 అం.వా, 8-15 హిం.వా, 8-30ప్రసార సమాప్తి.

11-00 ఉన్నత పాఠశాలలకు. (హైదరాబాదు నుండి రిలే), 11-50 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము (హైదరాబాదు నుండి రిలే), 1-00 పేరంటం స్త్రీల కార్యక్రమం, 1-30 లలిత సంగీతం- ఘంటసాల, 1-50 తె-వా, 2-00ప్రసార సమాప్తి.

సా॥ 6-00స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయవార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె.వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము. 7-30 సాహిత్యనందిని (హైదరాబాదు నుండి రిలే), 7-45 బొమ్మరిల్లుపాటలు 8-00 పెనుగంచిప్రోలు పెద మస్తాన్ సాహెబ్: క్లారినెట్, 8-30 కల్పలతశ్రోతలుకోరినపాటలు, 9-00 అం.వా 9-15 వునళ్ళగణ, 9-30 శ్రీ కృష్ణ రాయబారము హరికథా కాలక్షేపము కథకులు: గునపల్లి సూర్యనారాయణ భాగవతార్, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

మదరాసు, మైసూరుల దృష్ట్యా వేతనాల పునర్విచారణ

జరిపించ వలసిందిగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అభ్యర్థన

హైద్రాబాద్, మార్చి 5

హైయర్ గ్రేడ్ (మిడిల్ స్కూలు) టీచర్ల ప్రారంభ వేతనంలో రూ.లు,5 సెకండరీ గ్రేడు (మెట్రిక్ స్కూలు) టీచర్ల ప్రారంభ వేతనంలో రూ. లు, 5 బి. ఏ. స్కూలు సెలక్షన్ గ్రేడున్ను, అసిస్టెంటు లెక్చరర్ల అంతిమ వేతనంలో రూ. లు, 20 పెంచుతూ రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఫిబ్రవరి, 1961 నాడు రాష్ట్ర శాసన సభలో గావించిన ప్రకటనను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తూ ఒక ప్రకటన గావించింది. ఈ ప్రకటననుసరించి హైయర్ గ్రేడు టీచర్లకు పేకమిటీ సిఫారసు చేసిన 3-65 గ్రేడు కు బదులుగా 35-60 గ్రేడున్ను, సెకండరీ గ్రేడు టీచర్లకు 45-120 కి బదులుగా లోయర్ డివిజన్ గుమాస్తాతో సమానముగా 50-120 గ్రేడున్ను లభించగలదు. పేకమిటీ సిఫారసులప్రకారం స్కూలు గ్రాజువేట్ల సెలెక్షన్ గ్రేడు, అసిస్టెంటు లెక్చరర్లు మరియు యం. ఏ స్కూలు ఉపాధ్యాయుల వేతనం 150-250 ఉండినది. అర్థిక మంత్రిగారి ప్రకటనవల్ల ఈ గ్రేడు 150-30 కు పెంచబడినది. అయితే ఈ పెంపు 1958 లోనే జరుగవలసి ఉండినదనీ, ఇప్పుడు ఉపాధ్యాయులకు, మద్రాసు, మైసూరు పేకమిషన్‌ల సిఫారసుల దృష్ట్యా కనీస ప్రారంభ వేతనం, అంతిమ వేతనం ఇంకా పెంచవలసి ఉందని ఉపాధ్యాయ సంఘం కోరుతున్నది జూన్ 1960 లో వెలువడ్డ మద్రాసు పేకమిషన్ వారు హైయర్ గ్రేడు టీచర్‌కు రూ.లు, 75 (జీతం రూ.లు, 65 కరువుబత్తెం రూ.లు, 10) ప్రారంభ వేతనం లభిస్తున్నది. ఇటీవలనే ప్రకటింప బడిన మైసూర్ పేకమిషన్ సిఫారసుల దృష్ట్యా హైయర్ గ్రేడు టీచర్‌కు రూ.లు' 80 (జీతం రూ.లు, 70 కరువుబత్తెం) రూ.లు,10) ప్రారంభ వేతనం లభించగలదు. సెకండరీ గ్రేడు టీచరుకు మద్రాసులో రూ.లు, 100 (రూ.లు, 90 జీతం, రూ.లు, 10 కరువుబత్తెం మైసూరులో రూ.లు, 90 (రూ.లు, 80 జీతం, కరువు బత్తెం రూ.లు, 10) ప్రారంభ వేతనం లభిస్తున్నది మొన్నటి ఆర్థిక మంత్రిగారి ప్రకటన తర్వాతకూడా మన రాష్ట్రంలోని హైయర్ గ్రేడు టీచరుకు రూ.లు,65 న్ను, (జీతం రూ.లు, 35 కరువు బత్తెం 30) సెకండరీ గ్రేడు టీచరుకు రూ.లు, 64 (జీతం రూ.లు, 50 కరువు బత్తెం రూ. లు, 34) ప్రారంభ వేతనం లభిస్తున్నది. అంటే మద్రాసు స్కేళ్ళతో పోల్చిచూచినప్పుడు మన రాష్ట్రంలో హైయర్ గ్రేడు టీచర్‌కు ప్రారంభ వేతనంలో 10 రూ.లు, తక్కువ దొరుకుతున్నది, మైసూరుతో పోల్చి చూస్తే 15 రూ.లు, తక్కువ లభిస్తున్నది. అంతిమ వేతనంకూడా హైయర్ గ్రేడు టీచరుకు మద్రాసు వారు 110 రూ.లు, మైసూరు వారు 120 రూ.లు, (110 రూ.లు, జీతం, 10 రూ.లు, కరువుబత్తెం) ఇస్తే మన రాష్ట్రంలో మొత్తం 94 రూ.లు, (60 రూ.లు, జీతం, 34 రూ.లు, కరువు బత్తెం) లభిస్తున్నది.

సెకండు గ్రాజువేటుకు మన రాష్ట్రంలో 90-200 రూ.లు గ్రేడు ఉన్నది. అంటే ప్రారంభ వేతనం 90 ఇతరభృతి 86 రూ.లు, మద్రాసులో 140 ప్రారంభ వేతనం భృతి 10 రూ.లు; మైసూరులో 130 ప్రారంభ వేతనం, భృతి 10 రూ.లు, లభిస్తున్నది. డిసెంబరులో ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం మన రాష్ట్రంలో సెకండు గ్రాజువేటుకి అదనపు ఇంక్రిమెంట్లు ఇస్తారు, అంటే 1 2 రూ.లు, ప్రారంభ వేతనం, కరువు బత్తెం 88 రూ.లు, మొత్తం 140 రూ.లు దొరుకుతుందన్నమాట- కాని అలా అదనపు ఇంక్రిమెంట్లు దొరికిన వారికి మూడేండ్లదాకా మళ్ళీ ఇంక్రిమెంట్లు ఉండవు. అంటే మూడేళ్లదాకా 140 రూ.ల పైననే ఉండవలసి వస్తుంది. కాబట్టి ఎక్కువ లాభదాయకం కాదు. ఎటుచూసినా మద్రాసు మైసూరు రాష్ట్రాలతో పోల్చిచూస్తే మన రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు న్యాయం కలుగలేదని చెప్పాలి

ఉపాధ్యాయసంఘం ఉపాధ్యాయ వృత్తికి మెట్రిక్యులేషన్ కనీస విద్యార్హతగా నిర్ణయించి 100రూ.ల మొత్తం ప్రారంభ వేతనఘుగాయివ్వవలసిందని కోరుతూ వచ్చినది. ఇక ముందు హైయర్ గ్రేడ్ టీచర్ల నియామకం మానివేయాలనికూడా కోరింది.

పేకమిటీ సిఫారసులవల్ల ఉత్పన్నమైన తెలంగాణా ఉపాధ్యాయుల సమస్యల విషయంలో ఆర్థిక మంత్రిగారు తమ ప్రకటనలో ఏమీ పేర్కొననందుకు ఉపాధ్యాయసంఘం నిరాశ వెలిబుచ్చినది. 1-11-1958 తర్వాత మెట్రిక్యులేట్ టీచర్లు 40/-, 45/- మూల వేతనంపై నియమింపబడి, ఆతర్వాత రు. 30 కి తగ్గించబడ్డారు. వారియొద్దనుండి పెద్ద మొత్తాలు ఇంకా రాబట్టుకొంటున్నారు. వీరికి రు. 45 మూలవేతనం లభించవలసి ఉంది, రాబట్టుకున్నడబ్బు తిరిగిచెల్లించవలసి ఉన్నది. వాలంటరీ పాఠశాలల ఉపాధ్యాయులకు టీచర్ గ్రేడైన 30-45 ఇతనకు వర్తింపచేయలేదు కరువు బత్తెంకూడా లేకుండ వారికి అంతా కలిపి రు. 30 లే జీతంగా దొరుకుతున్నది. తెలంగాణా గ్రేడులలో ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు కొత్తకరువుబత్తెం ఇవ్వటంలేదు దానివల్ల ప్రమోషన్ దొరికినమీదట వారిజీతంతగ్గుతున్నది. పేకమిటీ సిఫారసులవల్ల ఏ విధంగా లాభం పొందక 130-190, 81-180, 164 275 గ్రేడులలో పనిచేస్తున్న వారిలో 75శాతం ఉపాధ్యాయులకు కొత్త స్కేలు ఇవ్వవలసిఉంది. రెండేళ్లనుండి ఈసమస్యలు అపరిష్కృతంగాపడిఉన్నవి మొన్నటి ప్రకటనలోనైనా వీటిప్రస్తక్తి లేనందువల్ల ఉపాధ్యాయులలో నైరాశ్యం మరీ ఎక్కువైంది.

ప్రకటననుముగిస్తూ ఉపాధ్యాయ సంఘం, మదరాసు, మైసూరు పేకమిషన్‌ల సిఫారసులదృష్ట్యా రాష్ట్రంలోని ఉపాధ్యాయులయొక్కయు, ఇతర తక్కువ వేతనాలుగల ఉద్యోగుల యొక్కయు జీతాల పునర్విచారణ జరిపించవలసిందనీ, పేకమిటీ సిఫారసులవల్ల ఉత్పన్నమైన తెలంగాణా ఉపాధ్యాయుల సమస్య సత్వరం పరిష్కరించవలసిందనీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినది.

నగరంలో ఆర్యసమాజ్ ఊరేగింపు

హోలీ ఉత్సవ సందర్భంగా

హైద్రాబాదు, మార్చి 5

హోలీ పండుగకు చెందిన రెండు రోజుల ఉత్సవాలు మొన్నమధ్యాహ్నం ఆర్యప్రతినిధి సభ ఆధ్వర్యాన జరిగిన బ్రహ్మాండమైన ఊరేగింపు కార్యక్రమంతో ముగిసినవి. కిషన్‌గంజ్ నుంచి మైలు పొడవున సాగిన యీ ఊరేగింపులో సంస్థకు చెందిన వివిధ ప్రాంతాలకు చెందిన శాఖలు పాల్గొన్నాయి ఊరేగింపునకుముందు వరుసలో మోటారు సైకిళ్ళ మీద కొంతమంది వారివెనుక యువకులు మహిళలు వివిధ గురుకులాలకు చెందిన బాల బాలికలు బారులు దీరి నినాదాలు చేస్తూ ముందుకు నడిచారు వీరందరి వెనుక అలంకరించబడిన ఏనుగు మీద ఓంధ్వజంతో ఆసీనులై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరేగింపులో పాల్గొన్న ప్రముఖులలో ఆర్యసమాజ్ నాయకులు, పండిత వినాయకరావు విద్యాలంకార్, పండితనరేంద్రజీ, కొత్తూరి సీతయ్యగుప్త కలరు.

ఊరేగింపు ముఖ్య వీధులగుండా తిరిగి సుల్తాన్‌బజార్ లోని ఆర్య సమాజ్ భవన్‌కు చేరింది.

తర్వాత జరిగిన సభలో పండిత కేశవఆర్యాశాస్త్రి చేసిన సంక్షిప్త ఉపన్యాసంలో యీ కార్యక్రమం నిర్విఘ్నంగాసాగి జయప్రదం కావడానికి తోడ్పడ్డ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శాంతి భద్రతల శాఖ నగర డిప్యూటీ పోలీసు కమిషనర్ శ్రీ టి. వి. రాజేశ్వర్, పోలీసు ప్రత్యేక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీ వి.జె. విక్టర్, సుల్తాన్‌బజారు ఎస్.ఐ పి. శ్రీ ప్రతాప్‌సింగ్ ఊరేగింపునకు కాపుదలగా వెళ్ళారు. పోలీసు యేర్పాట్లు తృప్తికరంగా చేయబడినవి.

—...

కామన్వెల్తు సమావేశాలకు నేడే శ్రీ నెహ్రూ ప్రయాణ

న్యూఢిల్లీ, మార్చి 5

మార్చి 8 న లండన్‌లో జరుగు కామన్వెల్తు ప్రధానుల సమావేశంలో పాల్గొనుటకు సోమవారం నాడు రాత్రికి బయలుదేరనున్నట్లు లోకసభలో ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ తెలిపారు.

లండన్‌లో 18 లేక 19వతేదీవరకు వుండగలనే మోననికూడ శ్రీ నెహ్రూ చెప్పారు. భారతదేశానికి విలయినంత త్వరలో తిరిగి వచ్చే ఉద్దేశం వుండుట వలన తిరుగు ప్రయాణంలో ఇతర దేశాలను దర్శించు తలంపులేదని శ్రీ నెహ్రూ అన్నారు.

—

ఫ్రాన్సులోని భారతీయ రాయబారిచే అధికార పత్రాల సమర్పణ

న్యూఢిల్లీ, మార్చి 5

ఫ్రాన్సులోని భారతీయ రాయబారి నవాబ్ అలీయావర్ జంగ్ మార్చి 1వ తేదీ ఉదయము ఎలైసీ ప్రాసాదములో ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడు జనరలు డిగోల్‌కు అధికార పత్రాలను సమర్పించారు.

భారతీయ రాయబారి అధ్యక్షుడు డిగోల్‌కు రాష్ట్రపతి యొక్క ప్రధాన మంత్రి యొక్క శుభాకాంక్షలను తెలియజేసి, ఫ్రాన్స్, ఇండియాల మధ్య స్నేహ సౌహార్దాలను పెంపొందించడానికి తాను సర్వవిధాలా పాటుపడగలనని హామీ ఇచ్చారు.

ఉభయదేశాల మధ్య చిరకాలంగా ఉన్న స్నేహసంబంధాలను బలపరచాలన్నదే తన అభిమతమని అధ్యక్షుడు డిగోల్ అన్నారు.

బేసిక్ వ్యవస్థకు అనురూపంగా ప్రాథమిక పాఠశాలలమార్పు

అఖిల భారత ప్రాథమిక విద్యామండలి సిఫార్సులు

న్యూఢిల్లీ, మార్చి 5

అన్ని ఎలిమెంటరీ పాఠశాలలను బేసిక్ వ్యవస్థకు అనురూపంగా కొంత వరకు మార్పుచేయడానికి రూపొందించిన కార్యక్రమాన్ని తృతీయ ప్రణాళిక మొదటి రెండేండ్లలో పూర్తి చేయాలని అఖిలభారత ప్రాథమిక విద్యామండలి సిఫార్సు చేసింది. ఈ మండలి సమావేశం గతమంగళవారం ఇక్కడ సమాప్తమైంది.

బళ్ళలో బాలికలను చేర్చేందుకు ప్రత్యేక కృషి జరిగితేనే తప్ప లేకపోతే తృతీయ ప్రణాళికా కాలంలో అనుకున్న ప్రకారం ప్రాథమికవిద్యను విస్తరించడం సాధ్యపడదని కూడా మండలి స్పష్టపరచింది.

తృతీయ ప్రణాళికా కాలంలో, 6-11 ఏండ్ల మధ్యవయస్సుగల పిల్లలలో నూటికి 80 మందిని బళ్ళలో చేర్చగలందులకయి, రు. 216 కోట్లు కేటాయింపుచేయాలని విద్యావిషయక పరిశీలక బృందం సిఫార్సు చేసి ఉంది. దరిమిలాను ఈ కేటాయింపును రు. 2 వందలకోట్లకు తగ్గించడం వల్ల 6-11 ఏండ్ల మధ్యవయస్సుగల పిల్లలలో నూటికి 76 మందిని మాత్రమే బళ్ళలో చేర్చడానికి వీలు పడుతుందనీ, కేటాయింపును మళ్ళీ రు.216 కోట్లకు పెంచి, మొదట అనుకున్న లక్ష్యాన్ని సాధించడం అవసరమనీ, సభ్యులు అభిప్రాయ పడ్డారు.

బేసిక్ విద్య

అన్ని ఎలిమెంటరీ పాఠశాలలలోను బేసిక్ వ్యవస్థను అనురూపమైన కొన్నిమార్పులు చేయడానికి రూపొందించిన కార్యక్రమాన్ని తప్పకఅమలు జరపాలనీ, యీ కార్యక్రమానికయి కనీసం రు. 8 కోట్లు కేటాయించాలనీ, తృతీయ ప్రణాళిక మొదటి, రెండవ సంవత్సరాలలో దీనిని పూర్తిచేయాలనీ మండలి సూచించింది.

బేసిక్ విద్యను గ్రామీణ అభివృద్ధితో ఇంకా ఎక్కువగా సమన్వయపర్చగలందులకయి తయారుచేసిన ఒక ప్రతిపాదనను మండలి పరిశీలించింది? విద్యా మంత్రిత్వ శాఖవారు వివరాలను రూపొందించే నిమిత్తం ఒక పరిశీలక బృందాన్ని నెలకొల్పాలని మండలి సిఫార్సు చేసింది.

బాలికా విద్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాల నిమిత్తం యిప్పుడు చేసిన రు. 5.63 కోట్ల కేటాయింపు పర్యాప్తం చాలదనీ, కేటాయింపును రు. 11 కోట్లకు పెంచాలనీ, సభ్యులు అభిప్రాయ పడ్డారు. బాలికా విద్యకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాల నిమిత్తము కేంద్ర రంగంలోనే అవసరమయిన నిధులను ప్రత్యేకించాలని కేంద్ర విద్యా సలహా మండలి చేసిన సిఫార్సును సభ్యులు ఆమోదించారు.

గ్రామీణప్రాంతాలలో సార్వజనీన ప్రాథమికవిద్యను ప్రోత్సహించగలందులకయి విద్యావిషయక ప్లానింగ్‌కు నిర్వహణ బ్లాకును ప్రాతిపదికగా తీసుకోవాలని అఖిల భారత ప్రాథమికవిద్యామండలిసూచించినది.

అధ్యాపక శిక్షణ కార్యక్రమాలకు కేటాయింపును రు. 20.92 కోట్లకు తగ్గించినందుకు మండలి ఆందోళన వెలిబుచ్చింది. ప్రాథమిక విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ శిక్షణ సంస్థలను అభివృద్ధి పరచడం అత్యవసరమనీ, రాష్ట్ర ప్రభుత్వాలు యీ కార్యక్రమానికై తమ వార్షిక ప్రణాళికలో చేసిన కేటాయింపులను పెంచాలనీ మండలి అభిప్రాయపడింది.

ప్రాథమిక విద్యకు ఉద్దేశించిన డబ్బును ఇతర రంగాలకు మళ్లించకుండా, తృతీయ ప్రణాళికలో ప్రాథమిక విద్యకోసం సొమ్ము ప్రత్యేకంగా కేటాయింపు చేయాలనీ, విద్యా రంగానికి సంబంధించి కేంద్రప్రభుత్వం నిర్వహించిన సర్వేను ప్రతి 5 ఏండ్లకు ఒకసారి అంటే ప్రణాళిక ప్రారంభంలోను సమీక్షించి ఎప్పటికప్పుడు దానిని సమగ్రంగా ఉండేట్టు సవరిస్తూ ఉండాలని మండలి సూచించింది.

—

"అశోక చక్ర" పతక బహూకరణ

న్యూఢిల్లీ, మార్చి 5

రాష్ట్రపతి కి ద పేర్కొన్నవారికి అశోక చక్ర (ద్వితీయ శ్రేణి) పతకాలు బహూకరించారు:- మేజర్ పరాయిల్ భాస్కరన్, మద్రాసు రెజిమెంటు స్క్వాడ్రన్ లీడర్, స్వర్గీయ అయ్యప్పన్ సుధాకరన్, సిపాయి చుహార్ సింగ్, సిఖ్ వదాతిదళము రైఫిల్‌మన్, స్వర్గీయ హన్స్‌రాజ్, జమ్ము-కాశ్మీరు రెజిమెంటులో మూడవశాఖ.

వీరికి తోడు క్రిందివారికి అశోక చక్ర (తృతీయ శ్రేణి) పతకాలు బహూకరించబడ్డాయి 2-లెఫ్‌టినెంట్ సామర్ సింగ్ చాందేల్, జమ్ము-కాశ్మీరు రెజిమెంటులోమూడవశాఖ జమేదార్ ప్రీతిసింగ్, పంజాబు రెజిమెంటులో తొమ్మిదవశాఖ. లాన్స్‌నాయక్ నీలకంఠ భాస్కర్ పణికర్, భారత వైమానికదళం.

నాకు ప్రాణాస్పదము...
జమ్మివారి లివర్‌కూర్
...నన్ను లివర్, స్ప్లీను బాధలనుండి రక్షించినది
జమ్మి వెంకటరమణయ్య & సన్స్ మద్రాసు-4
సికింద్రాబాద్‌లో తాజ్‌మహల్ హోటల్, నరోజినీదేవిరోడ్డునందు ప్రతి నెల 8 వ తేదీన ఉ॥ 9-00 నుండి 12-00 వరకు.
హైద్రాబాద్‌లో న్యూ తాజ్‌మహల్ హోటల్ (లాడ్జింగ్ సెక్షన్) పూర్వపు ఇండియన్ కాఫీహౌస్, రెసిడెన్సీ రోడ్డు నందు ప్రతి నెల 9వ తేదీ ఉ॥ 9-00 నుండి 12-00 గం॥ మా డాక్టరును సంప్రదించవచ్చును.

అన్వేషించి తరించండి
ఇండియా
ముచ్చటైన మన మాతృదేశం
కొబ్బరి తోటలతో, ఆహ్లాదకరమైన దృశ్యాలతో విలసిల్లే కేరళ తీరాన్ని, తంజావూరు, మదురై, ఖజురహోలలోని సుషమాన్వితమైన సుందర దేవాలయాలను, పచ్చపచ్చగా నిత్యకళ్యాణ మయంగా కనుపించే అస్సాములను, బుద్ధభగవానుని జ్ఞానోదయసీమ-బీహార్‌ను, శిల్పకళా వైభవ్య విలసితమైన అజంతా, ఎల్లోరా గుహలను, మొగలాయి రాజుల "భూలోక స్వర్గసీమ"-కాశ్మీరును, రాయిరాయికి, గుట్టగుట్టకు ప్రసిద్ధమైన చరిత్ర కలిగిన్న రాజస్థాన్‌ను, మనోహరమైన వాతసోల్లాసం కలిగించే అసంఖ్యాకమైన సుందర నందనవన సీమలు కాశ్మీరు, సిమ్లా, ముస్సూరీ, నైనిటాల్, డార్జిలింగ్-మున్నగునవి కల హిమలయోత్తుంగ శృంగాగ్రాలను ఈ సంవత్సరమే దర్శించి తరించండి.
మీ ప్రయాణపు వేళ్లాట్ల వరకుల మీ సమీపం భారత ప్రభుత్వం టూరిస్ట్ అధికారి సంప్రదించండి
భారత ప్రభుత్వం టూరిస్ట్ అధికారులు: బొంబాయి • కలకత్తా • ఢిల్లీ • మద్రాసు • ఆగ్రా బెంగుళూరు • వారణాసి • హైదరాబాద్ • లోనావాలా • కొచ్చిన్ • ఇండోర్ • జైపూర్
DA 60/719

11 వ సంయుక్త వారము!
ప్రభాత్స్:
ఏక్ ఫూల్ - చార్ కాంటే
సంగీతం: శంకర్ జైకిషన్.
సునిల్ దత్, వహీదా రెహమాన్, జానీవాకర్, డేవిడ్, ధుమల్.
లిబర్టీ ప్రకాష్
బషీర్ బాగ్ మంగళ్ హాట్.
ప్యారడైజ్ సికింద్రాబాద్
ఆటలు: 6-30 9-30.
—శ్రీ బాలాజీ పిక్చర్స్ విడుదల.
(Nima)

పండి, బంగారుధరలు

సముద్రాల రాఘవులు గారి చంద్రయ్య సిద్దంబర్ బజారు.
ఫోన్ నెం. 4990
హైద్రాబాద్, మార్చి 5

బంగారం	142-00
అశోక్ చిల్లు	142-25
సవరన్	91-00
వెండి 10తు.	242-00
చిల్లర	2-47

మర్చంట్ అండ్ కమీషన్ ఏజంట్

మెసర్స్ కల్వసూర్యనారాయణ
ఉస్మాన్‌గంజ్-హైద్రాబాదు
ఫోన్ నెం 4413
హైద్రాబాద్, మార్చి 5
(క్వింటల్ ధరలు)

నానకరాంలు	54-00 56 00
గర్కలు	50-00 52-00
పాలకుర్లు	54-00 56-00
24 నంబర్లు	64-50 66-00
బంగారుతీగెలు	66-00 69-00
గుజ్జలు	55 00 56-70
గొట్టెలియ్యం	48-00 51-00
కుసుమలియ్యం	58-00 59-00
దొడ్డలియ్యం	52-00 53-60
సెంబరు	55-00 58-00
సాంబర్లు	66-00 69-50
కొత్త సాంబర్లు	60-00 64 00
మూకలు	31-00 42-00
వరంగల్ సాం. పా.	74-50 75 00
బన్సి గోధుమలు	57-00 61-00
కుస్మలు	53-00 54-50
కందులు పెద్దవి	39-00 41 50
కందులు చిన్నవి	36 00 37-00
మినుములు	51-00 54-00
పెసలు	49 00 49-50
తెల్లం కొ.	38-00 39 00
పెసళ్ళు కొ.	51-00 53-75
తె కొన్నలు	37 00 41-00
ఎ కొన్నలు	33-00 34-00
మిరపకాయలు	80-00 150-00
పసుపు	86-00 90-00
ఉల్లిగడ్డ కొ.	14 00 17-00
చింతపండు కొ.	45-00 68-00
నల్లవులవలు	30-50 31-77
తెల్లనువ్వులు	130-00 140-00
పద్దలు	38-00 39 00
పెద్ద కందిపప్పు	55-00 56-00
చిన్న కందిపప్పు	50-00 52-00
పెసరపప్పు	61-00 62-00
పెసరపప్పు	71-00 72-00
మినుపపప్పు	70-00 71-00
అముదాలు	62-50 63-00
అంకపిండి	42-00 43-00
ఇలాతిదాన చిం॥	83-00 88-25
యెర్రనువ్వులు	115-00 121-00
యెర్ర కొబ్బర్లు	51-00 53-00
ఆల్లం	45-00 55-00
యెల్లిగడ్డ	30-00 42-00
పల్కునూనె	208 70
ధనియాలు	85 00 90 00
శర్కరిగోధుమలు	
లంకపప్పులు	39-00
యెర్రగోధుమలు	42-00 43-00

నాగార్జున సాగర్ ప్రాజెక్టు (డాం)
టెండర్ నోటీసు
నం. 49/ T P 3/ 60-61 తేది 23-2-61
దిగువ నుదాహరించిన పనులకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, మెటీరియల్ డివిజన్, నాగార్జునసాగర్ డామ్, విజయపురి వార్డు, కాల్ కాలని, మిర్యాల్‌గూడ తాలూకా, నల్గొండజిల్లా ఆంధ్రప్రదేశ్ అడ్రసుకు 25-3-61 సాయంత్రం 4 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేంద్ర లేక ఏ యితర రాష్ట్రముల 'ఎ' తరగతి కంట్రాక్టర్లనుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. అదే రోజు సా॥ 4-15 గం. టెండర్లు తెరువబడును.
టెండరు షెడ్యూళ్లు, యితర డాక్యుమెంట్లు పై వారి కార్యాలయము నుండి ప్రతిసెట్టుకు రు. 25-50 చెల్లించిన 6-3-61 నుండి 24-3-61 వరకు ఆఫీసు వేళలలో పొందవచ్చును.

నెం.	పని పేరు	కోరబడిన డిపాజిట్ పైకం	పూర్తిచేయవలసిన గడువు	కంట్రాక్టు స్వభావం
1.	బండ్ల కర్వవద్ద ఛార్జింగ్ రబ్బీల్ మరియు గవర్నమెంట్ ట్రక్కులలో నింపి సప్లయి చేయుట మరియు ఖాళీ చేయుట.	రు. 50,000/-	30-3-61	లమ్సం

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ
టెండర్ ప్రకటన
"రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌నందు బొగ్గుతీసుకొని పోవుటకు టెండర్" మరియు "రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌నందు బొగ్గు నునితీసి అమ్ముటకు టెండర్" అని పేర్కొని సీల్డు టెండర్లు బొగ్గు తీసుకొని పోవుట, మరియు బొగ్గునుని తీసివేయుట కొరకు సంవత్సరిక రేటు కంట్రాక్టుపై విడివిడిగా టెండర్లు దిగువ వారికి 23-3-1961 సా॥ 3-0 గం. లోపు అందునట్లు పంపవలెను. నిర్ణీత టెండరు ఫారములు ప్రతిది రు. 1/- చెల్లించి దిగువవారి కార్యాలయము నుండి 20-3-1961 లోపు పొంది పూర్తిచేసి పంపించవలెను.
నిర్ణీత తేది తరువాతవచ్చు టెండర్లు అంగీకరించబడవు. ఏ కారణము చూపక ఏ టెండరైన నిరాకరించుటకు దిగువ వారికి హక్కులు గలవు మరియు అన్ని విషయములలోను తుది తీర్మానము కూడా చేయుటకు హక్కు గలిగి యున్నారు.
సూపరింటెండింగ్ ఇంజనీర్ (జనరేషన్)

నేటి రాత్రి నేటి రాత్రి
రష్యన్ పంచరంగుల సినిమాస్కోప్ చిత్రం!
అపూర్వ
కలియుగ భీముడు
THE SWORD & THE DRAGON
అద్భుత ఆకర్షణ
"A MILLION IN A BAG"

అజంతా సికింద్రాబాద్ & దీపక్ మహల్ సైదాబాద్
ఆటలు: 6-30, 9-30.
(Nima) —నైజాం: అన్నపూర్ణా పిక్చర్స్, సికింద్రాబాద్.

క్రీడారంగం

క్రికెట్

రంజీ ట్రోఫీ అంతిమ పోటీకి బొంబాయి, రాజస్థాన్ జట్లు ఢిల్లీ, మద్రాసు జట్లను ఓడించి నిలబడ్డాయి. బొంబాయి జట్టు ఢిల్లీ జట్టును ఇన్నింగ్స్ తేడాతో ఓడించింది. బొంబాయి మొదటి ఇన్నింగ్స్ లో 527 పరుగులు చేసింది. ఢిల్లీ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 192 పరుగులు, రెండవ ఇన్నింగ్స్ లో 192 పరుగులు మాత్రమే చేసింది. మద్రాసులో జరిగిన ఇంకోక అర్ధాంతిమ పోటీలో రాజస్థాన్ జట్టు, మద్రాసుజట్టును తలవని తలంపుగా ఓడించింది. మొదటి నుండియూ మద్రాసు విజృంభించి ఆడింది. రాజస్థాన్ మొదటిఇన్నింగ్స్ లో 301 పరుగులు చేయగా, మద్రాసుజట్టు 328 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్సులో రాజస్థాన్ 210 పరుగులు చేసింది. అప్పటికి ఆటనుబట్టి చూడగా మద్రాసుకు విజయం లభించగలదని అందరూ అనుకున్నారు. కాని మద్రాసు 116 పరుగులు మాత్రమేచేసి 67 పరుగుల తేడాతో ఓడిపోయింది.

రంజీట్రోఫీ, అంతిమపోటీ ఉదయపూర్ లో ఈనెల ఎనిమిదవ తేదీనుండి ప్రారంభము కాగలదు.

వెయిట్‌లిఫ్టింగ్

13 వ జాతీయ వెయిట్‌లిఫ్టింగ్, కండరనిర్మాణపోటీలు ఎర్నాకుళంలో వరసమాప్తిఅయినవి. అందు రైల్వే జట్లు అయిదవసారి 88 పాయింట్లు సాధించి బర్ద్వాన్ ఛాలెంజ్ షీల్డును చేజిట్టింది. సైనికదళాలజట్టు 40పాయింట్ల సాధించి ద్వితీయులుగనూ, ఆంధ్రా 17పాయింట్లు సాధించి తృతీయులుగనూ వచ్చినవి. "భారత శ్రీ 1961" తూర్పుబెంగాల్ కు చెందిన శ్రీసత్యం దాస్ కు లభించింది. "భారత్ కుమార్ 1961" కూడా తూర్పు బెంగాల్ కు చెందిన శ్రీరాధేశ్ గోస్వామికు లభించింది. లైట్-హెవీ వెయిట్ పోటీలో ఆంధ్రాకుచెందిన శ్రీకామి నేనిఈశ్వరరావుకు ప్రథమ స్థానం లభించింది. వారికార్డు (ప్రెస్) 280 పౌనులు, (స్నాచ్) 250 పౌనులు; (క్లీన్-అండ్ జర్క్) 325 పౌనులు. మొత్తం 855 పౌనులు. ఇందులో అరవస్థానం ఆంధ్రాకుచెందిన శ్రీ వి. వెంకటేశ్వరరావుకు లభించింది. వీరిమొత్తం 680 పౌనులు.

టెన్నిస్

ఢిల్లీలో జరిగిన అంతర్ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల టెన్నిస్ అంతిమ పోటీలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయం-ఢిల్లీజట్టు, ఆంధ్రజట్టును 3-0మ్యాచిలతోసునాయసంగా ఓడించి, రాష్ట్రపతి కప్‌ను గెలుచుకొన్నది. వివరాలు: శ్రీ బి. కె. దుత్తా (ఢిల్లీ) శ్రీ పి. కె. దొరై స్వామి(ఆంధ్రను) 6-1; 6-1 సెట్లతోనూ, శ్రీ ఎ.యల్ రాయ్ (ఢిల్లీ) శ్రీ జనార్దన రెడ్డి (ఆంధ్ర)ను 6-0, 6-1 సెట్లతోనూ సునాయాసంగా ఓడించారు. డబుల్స్ లో శ్రీయుతులు రామారావు, ఖడే (ఢిల్లీ) శ్రీయుతులు జనార్దనరెడ్డి, రామస్వామినాయుడు (ఆంధ్ర)లను 6-1; 6-1 సెట్లతో ఓడించారు.

విజయనగరంలో మార్చి 25 నుంచి ఆంధ్ర ప్రదేశ్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభ మయినవి అందు ఆంధ్ర ప్రదేశ్ నలుమూలల నుంచి అనేకమంది ప్రముఖ ఆటగాళ్ళు పాల్గొన్నారు. హైద్రాబాదు నుండి కూడ ఆటగాళ్ళు పాల్గొన్నారు. హైద్రాబాదు క్రికెట్ బోర్డు కు చెందిన శ్రీ యస్. సుదర్శన్, విశాఖపట్నంకు చెందిన శ్రీ జె. మోసెస్‌ను మొదటిపోటీలో 6-2; 6-3 సెట్లతో సునాయాసంగా ఓడించారు. ఆంధ్రా ఆటగాడు మాజీ భారతరైల్వే ఛాంపియన్ అయిన శ్రీ కె. గోపాల్ రావు మైసూరు ప్రముఖ రాష్ట్ర ఆటగాడైన శ్రీ బి. శేషాద్రిని 6-4; 6-1 సెట్లతో ఓడించారు. శ్రీ గోపాల్ రావు ఇంతకుపూర్వం రాజమండ్రిలో జరిగిన టెన్నిస్ పోటీలలో కూడా విజయం చేపట్టారు.

వాలీ-బాల్

ఉస్మానియా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల వాలీబాల్ అంతిమ పోటీలో హైద్రాబాదు సాయం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయ కళాశాలజట్టుకు9-15; 15-9; 15-3గేమ్ లతో ఓడించారు. గత మూడుసంవత్సరములనుంచి విజయం పొందుచున్న ఉస్మానియా జట్టు ఈ సంవత్సరము ఒటమికి గురి అయినది. హైద్రాబాదు సాయంకళాశాల జట్టువిజయానికి శ్రీ జయరాజ్ కారకులు.

ఫుట్-బాల్

భారత దేశంలో ఖ్యాతి గాంచిన మోహన్ బాగన్ ఫుట్‌బాల్ జట్టు (కలకత్తా) తూర్పు ఆఫ్రికాలో పర్యటిస్తున్నది. మొదటిపోటీలో ఉగాండా లైన్స్‌ను 2-1 గోలులతో ఓడించింది. రెండవ పోటీలలో ఉగాండా తూర్పు ప్రాంతం జట్టును 2-1 గోలులతో ఓడించారు. భారతజట్టులో శ్రీయుతులు బెనర్జి, గోస్వామి బాగాఆడారు 3వ పోటీలో మోహన్ బాగన్ జట్టు ఉగాండా ఉత్తర ప్రాంతం జట్టును 4-0 గోలులతో ఓడించింది. విరామ సమయానికే మోహన్ బాగన్ మూడుగోలులు చేసి వున్నది.

క్విలన్‌లో జరుగుచున్న అఖిల భారత ఫుట్-బాల్ పోటీలలో హైదరాబాదు నుంచి సిటీ కాలేజి పాత విద్యార్థుల జట్టు పాల్గొన్నది. మొదటి రౌండులో త్రివేంద్రం క్లబ్‌ను 3-2 గోలులతో ఓడించి, రెండవ రౌండులో ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్, బెంగుళూరు జట్టుతో 1-8 గోలులతో ఓడిపోవడం సంభవించింది.

హాకీపోటీలు

ఢిల్లీలో జరిగిన అంతర్ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల అంతిమ హాకీపోటీలో భారత రైల్వే జట్టు, కేంద్ర రెవెన్యూ జట్టును 2-0 గోలులతో ఓడించి విజేతలు అయినారు.

సికిందరాబాదు పోలీస్ మైదానములో జరుగుచున్న 28 వ జాతీయ హాకీపోటీలలో మూడవ రౌండులో బొంబాయి జట్టు మధ్యభారత్ జట్టును ఒక్కగోలుచేసి అతికష్టంమీద ఓడించింది. బొంబాయి జట్టు పాదాంతిమ పోటీలో ఉత్తర ప్రదేశ్ జట్టుతో పోటీ చేయనున్నది. మరియొక పోటీలో మద్రాసు జట్టు, ఢిల్లీను 3-1 గోలులతో ఓడించింది. మద్రాసు జట్టు పాదాంతిమ పోటీలో నిరుటి రన్నర్స్ అయిన రైల్వే జట్టుతో పోటీ చేయనున్నది. ఈ పోటీలలో పాల్గొనుటకువచ్చిన గుజరాత్ జట్టును కారణాంతరములచే ఆడనివ్వనందున, మైసూరు జట్టు గెలిచినట్లు నిర్ణయించడమయినది.

[ఏకా]

సంస్కృత భాషా పరిశోధనలు

కేంద్ర విద్యామంత్రిత్వ శాఖచే 17స్కాలరుషిప్పుల బహూకరణ

న్యూఢిల్లీ, మార్చి 5

సంప్రదాయ సిద్ధమయిన సంస్కృత పాఠశాలల్లో శిక్షణ పొందిన పండితులకు ఇచ్చే పరిశోధక స్కాలర్ షిప్పులను కేంద్రసంస్కృత విద్యా మండలి సిఫారసులపై కేంద్ర విద్యామంత్రిత్వ శాఖద్వారా పేర్కొన్న 17మందిఅభ్యర్థులకు యివ్వ నిర్ణయించింది.

శ్రీ ఎ.డి. రామానుజతాతాచార్ శ్రీ ఎస్. ఎస్. శ్రీరామ దేశికన్, శ్రీ వి. నాగరాజాచార్, శ్రీ ఎ. ఎస్. వెంకటనాథన్, శ్రీ ఆర్. కె. నారాయణశాస్త్రి, శ్రీ భాగీరథ్ ప్రసాద్ త్రిపాఠి, శ్రీ ఆర్యప్రసాద్ మిశ్రా, శ్రీ ఓంప్రకాశ్, స్వామి నేరె సురేశ్వరానంద్ భారతి, స్వామి సర్వదానంద్ పరమహంస, శ్రీగణేష్ శుక్లా, శ్రీ పి. పి. ఉపాధ్యాయ, శ్రీ ప్రభాకర్ ఆచార్య, శ్రీ పద్మద్యుమ్నశుక్లా, శ్రీ మురళీధర్ పథక్, శ్రీ ఆత్మారామ్ కె. శాస్త్రి, శ్రీ ముంశీధర్ చతుర్వేది.

సంస్కృత భాషలో పరిశోధనలు సాగించేందుకుగాను సంప్రదాయ సిద్ధమయిన పద్ధతులలో, సంస్కృత విద్యాభ్యాసం సాగించిన పండితులకు స్కాలర్ షిప్పులిచ్చేందుకు భారత ప్రభుత్వం ఒక పథకం ప్రవేశపెట్టింది.

ఈ స్కాలర్ షిప్పు పొందిన వారికి నెలకు రు. 100 లిస్తారు. ఈ స్కాలర్ షిప్పు కాలపరిమితి రెండు సంవత్సరాలు లేదా, పరిశోధక కృషి అంతకు ముందుగా పూర్తిఅయితే, అప్పుడే ఆఖరవుతుంది.

...—

సభలు, ఊరేగింపులపై నిషేధం

హైద్రాబాదు, మార్చి 5

హైద్రాబాదు సికిందరాబాదు నగర పోలీసు కమిషనర్, రాష్ట్ర అసెంబ్లీ భవనం, పబ్లిక్ గార్డెన్ సమీపంలో అర మైలు లోపల సభలు సమావేశాలు ఊరేగింపులు ఈనెల 6 ఉదయంనుంచి 11 వరకు జరుపుటకు వీలు లేదని వాటిని నిషేధించారు.

మత సంబంధమయిన ఊరేగింపులు జరుపతలచిన వారు ముందుగా తన అనుమతి పొందాలని పోలీసు కమిషనర్ నిషేధ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

—

ఆర్థిక, ఆరోగ్యమంత్రుల ఢిల్లీ ప్రయాణం

హైద్రాబాద్, మార్చి 5

రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ పి. వి. జి. రాజు ప్రభృతులు రాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాలను కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంతో చర్చించుటకు నిన్న ఢిల్లీ వెళ్ళారు వారు యీనెల 6 న తిరిగి యిక్కడకు వస్తారని తెలుస్తున్నది.

—

అగ్గిపెట్టెల ధరలో నయాపైసా అధికం

శివకాసి, మార్చి 5

చిల్లర దుకాణదారులు అగ్గిపెట్టెల ధరలను పెంచుట సమంజసంగా లేదని శివకాసి అగ్గిపెట్టెల ఉత్పత్తిదారుల సంఘ కార్యదర్శి శ్రీ సి. అరుముగస్వామి అన్నారు. "ప్రభుత్వం అగ్గిపెట్టెలపై అధిక పన్ను విధించలేదు. ఉత్పత్తిదారులుకూడ టోకు ధరను పెంచలేదు. ఐనా చిల్లరవ్యాపారులు నూతన పన్ను విధింపబడిందని సాకుతో మార్చి 1 నుండి వెలలో ఒక నయాపైసను పెంచారు" అని శ్రీ అరుముగస్వామి ఒక ప్రకటనలో తన వ్యతిరేకతను తెలియజరచారు.

—

నేడు సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయ భవనములో సుప్రసిద్ధ రచయితలు శ్రీపట్టిపాటి ఆళ్వారుస్వామి, శ్రీశ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారల మృతికి సంతాప సభ జరుగుతుంది.

1960-61 వివేకవర్ధని సాయంకళాశాల కాలేజి ఛాంపియన్ శ్రీ సి. పట్టాభిరామన్.

భారత భూతత్వజ్ఞుల ప్రతిభకు ప్రశంసలు

ఉస్మానియా భూతత్వ శాస్త్ర అధ్యాపకుల సభలో ప్రొ. హాయకావ

హైద్రాబాదు, మార్చి 5

భారతదేశ భూతత్వ శాస్త్రజ్ఞుల ప్రతిభను పేర్కొని వారిని ప్రశంసిస్తూ ఆచార్య ఎం. హాయకావ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన కళాశాలలలోని భూతత్వశాస్త్ర అధ్యాపకుల ద్వితీయ వార్షిక మహాసభను ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ భూతత్వశాస్త్రశాఖ అధిపతి డా॥ ఎస్. బాలకృష్ణసభకు అధ్యక్షత వహించారు.

సభలో యీ శాస్త్రమునకు సంబంధించిన పరీక్షల పాఠ్యావళి మొదలైనవాటిని గురించి చర్చలు జరిగినవి. వచ్చే సంవత్సరపు కార్యక్రమం తయారుచేయడానికి ఒక ఉపసంఘం నియమించబడింది. ఆచార్య హాయకావ చేసిన ప్రసంగంలో అంతర్జాతీయ భూతత్వశాస్త్రజ్ఞుల సమ్మేళనం 1964లో జరుగుతుందని చెల్లడించారు. యీనెల11న కాను జపాన్ వెళ్ళుతున్నటు తెలియచేస్తూ ఆదేశంలో యీ శాస్త్రశాఖకు సంబంధించిన వివిధ విషయాలను పేర్కొంటూ అక్కడ భూతత్వశాస్త్రజ్ఞులు చేస్తున్న కృషిని వివరించారు.

డా॥ బాలకృష్ణచేసిన ప్రసంగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యీశాస్త్రంపై చేసిన పరిశోధన వివరాలను వాటి ఫలితాలను ముచ్చటించారు.

—

మిస్ అనితాబోస్

హైద్రాబాదు, మార్చి 4

నేతాజి సుభాస్ చంద్రబోస్ కూతురు మిస్ అనితాబోస్ మద్రాస్ నుండి నేటి మధ్యాహ్నం హైద్రాబాదు వచ్చింది. నగరంలో ఈమె ఒకరోజు ఉంటుంది. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు అనితాబోస్‌కు అల్పాహారవిందు చేశారు. దీనికి ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య మంత్రి వర్గసభ్యులు శాసనసభ్యులు ఇతర ప్రముఖులు హాజరయినారు.

—...

పనివేళలందు ఉపయోగపడని విద్యుచ్ఛక్తి

సికింద్రాబాదులోని పరిస్థితి

హైద్రాబాద్, మార్చి 5

సికింద్రాబాదు సుభాస్ రోడ్డులో వ్యాపారాలు సాగించు కొంటున్నవారు పనిలో మునిగితేలే వేళలందు అక్కడ విద్యుత్ సరఫరా ఆగిపోవటం జరుగుచున్నదని దానివల్ల వారుఅందోళనకు గురికావటము తటస్థిస్తున్నది. ఆ ప్రాంతములో యీసమస్యదృష్ట్యా యిబ్బందులు పడుతున్న మండుల విక్రయ సంస్థలు, జారీయెత్తు వ్యాపారము సాగించే వివిధ వాణిజ్య సంస్థలు యీ విషయాన్ని గురించి విద్యుచ్ఛక్తి శాఖ ప్రధాన ఇంజనీరుకు వివరిస్తూ వెంటనే తమకు యీబాధనుంచి విముక్తులను చేయవలసిందని కోరినట్లు తెలుస్తున్నది.

—

ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంఘం

హైద్రాబాదు, మార్చి 5

ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంఘం వచ్చే సమావేశం 1961 మార్చి 6 వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు హైద్రాబాదు శాసనసభా భవనాలలోని అసెంబ్లీ హాలులో జరుగుతుంది. ఆ మర్నాడు కూడా బహుళా సమావేశం కొనసాగుతుంది.

సైనిక శాఖలో కమీషన్ హోదాలు

న్యూఢిల్లీ, మార్చి 5

భారత సైనిక శాఖలోనుంచి విడుదలయిన నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు ఆఫీసర్ల రెగ్యులర్ రిజర్వు దళములో కమీషను హోదాలివ్వబడతాయని రక్షణ మంత్రిత్వశాఖ నిన్న ఒక ప్రకటనలో తెలియజేసింది. సైనిక శాఖలోంచి విడుదలయిన స్వల్పకాలిక రెగ్యులర్ కమీషను ఉద్యోగులూ, ఎమర్జెన్సీ కమీషన్ ఉద్యోగులూ, తాత్కాలిక కమీషను ఉద్యోగులూ మాజీ రాష్ట్ర దళాల ఉద్యోగులూ లేదా "సి" సర్టిఫికేటు గల జాతీయ సైనిక విద్యార్థిదళ సీనియర్ శాఖ సైనిక విద్యార్థులూ,ఇతర పౌరులూ వీటికి దరఖాస్తు పెట్టుకోవచ్చును.

సైనిక శాఖలోంచి విడుదలయిన ఉద్యోగుల వయస్సు దరఖాస్తు పెట్టుకున్న తరువాత వచ్చే జనవరి 1వ తేదీకి 20-40 సంవత్సరాల మధ్య వుండాలి. సి-సర్టిఫికేటు పుచ్చుకున్న జాతీయ సైనికవిద్యార్థిదళ, సీనియర్ శాఖ సైనిక విద్యార్థుల వయస్సు 20-25 సంవత్సరాల మధ్య వుండాలి. ఇతర పౌరులకు కనీస వయః పరిమితి 20 యేళ్ళు గరిష్ఠ పరిమితి 30 యేళ్లు,

దరఖాస్తు ఫారాలను, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలనూ సమీపానగలరిక్రూటింగులఫీసుకుగానీ, సబ్ ఏరియా లేదా బ్రిగేడ్ ప్రధాన కార్యాలయానికిగాని వ్రాసి ఉచితముగా తెప్పించుకోవచ్చును.

—

రైల్వేయార్డులో ముడియినుము గుట్టలు

వాగన్‌ల కొరత కారణాన

మానుకోట, మార్చి 5

కాకినాడ, విశాఖపట్నంలాంటి రేవులకు చేరవలసిన సుమారు 20 వేల టన్నుల ముడి యినుము రవాణా సౌకర్యాలు లేక యిక్కడ రైల్వే స్టేషన్ లో పేర్చబడివున్నది. సమీపంలోని నిలాంచ గనినుంచి రోజూ సగటున 8వందలటన్నులు ముడియినుము మానుకోటకు తరలించబడుచున్నది. రైల్వేవాగన్‌ల కొరతవల్ల యిక్కడకు వచ్చే యినుము అంతా గుట్టగుట్టలు పోయబడివుంటోంది. ఇనుము రవాణాచేసే ఎగుమతి వర్తకులకు యిదొక పెద్ద సమస్యగా తయారై వేధిస్తున్నది. దీని దృష్ట్యా వారు రైల్వే అధికారులకు వాగన్‌లు సరఫరా చేయవలసిందని కోరుతూ పంపిన విజ్ఞప్తులవల్ల పరిస్థితిలో యేవిధమైన మార్పువచ్చినట్లు కనపడటంలేదు.

ఇక మిగతా వస్తువుల విషయములో కూడ యీ పరిస్థితే యెదురవటంవల్ల వారి రవాణా కూడా నిలిచిపోయింది. వర్షాకాలం వచ్చేలోపున యీ గడ్డు సమస్య పరిష్కారముకాకపోతుందా అనే ఆశ వర్తక లోకంలో సూచన ప్రాయముగా కనపడుతున్నప్పటికి ప్రస్తుత పరిస్థితులను బట్టి దానిపై పూర్తిగా ఆధారపడటానికి వీలులేకున్నది.

—

సిలోన్ తమిళ విద్యార్థులచే ప్రదర్శనలు

మద్రాస్, మార్చి 4

జాఫ్నాలో పోలీస్ కృత్యాలను నిరసిస్తూ సిలోన్ అసిస్టెంట్ కమీషనర్ కార్యాలయాలముందు దాదాపు 100 మంది నగర కళాశాలలకుచెందిన సిలోన్ తమిళ విద్యార్థులు శాంతియుతముగా 10 నిమిషాలపాటు ప్రదర్శనలు జరిపారు. వారు తరువాత ఒక కార్యాలయోద్యోగికి తమ కోర్కెలను తెలియజేయు నివేదిక సమర్పించారు.

ఉత్తమ గ్రంథాలకు 9 అకాడమీ బహుమతులు

తెలుగులో శ్రీ అప్పారావు "నాట్యశాస్త్రము"నకు ఇవ్వ అకాడమీ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 5

సాహిత్యఅకాడమీ కార్యనిర్వాహక వర్గము నిన్న ఉదయం ఇచట ప్రధాన మంత్రి శ్రీజవాహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన సమావేశమై సాహిత్య అకాడమీ 1960 వార్షిక బహుమతులకై 9 పుస్తకాలను ఎన్నుకుంది. భారతదేశ ప్రధాన భాషలందు 1957 జనవరి మాసారంభమునుండి 1959 డిసెంబరు అంతంవరకు ముద్రితములైన మేటి పుస్తకాలని ఎన్నుకోబడిన వీటి రచయితలకు రు. 500ల ప్రకారము పారితోషికము లివ్వబడును.

శ్రీ బెనుధర్ శర్మ రచించిన "శాంగ్రేచార్ కథ్యాలి రాదర్" (అస్సామి), శ్రీఆర్. కె. నారాయణ "ది గైడ్" (ఇంగ్లీషు), శ్రీ రవిశాల్ సి. పరీఖ్ "శార్విలక్" (గుజరాతి), శ్రీ సుమిత్రా నందన్ పంత్ "కలా అవుర్ బుర్హా చాంద్" (హిందీ), శ్రీ వి. కె. గోకక్ "ద్యావాపృథ్వీ" (కన్నడ), శ్రీ పి. సి. కుట్టి కృష్ణన్ "సుందరి కలుమ్" (మళయాళం), శ్రీ వి. ఖండేకర్ "యయాతి" (మరాఠి), శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు "నాట్యశాస్త్రము" (తెలుగు), శ్రీ ఫిరఖ్ గోరఖ్‌పూరి "గుల్-ఎ-నగ్మా" (ఉర్దూ) అను గ్రంథాలు పైబహుమతులకు ఎన్నుకోబడినవి.

నిర్ణయించబడిన పైసమయములో బెంగాలి, కాశ్మీరి, ఒరియా, పంజాబి, సంస్కృతము, సింధి, తమిళ భాషలందు చెప్పుకోదగిన గ్రంథము లేవీ ముద్రింపబడలేదని అకాడమీ కార్యవర్గము అభిప్రాయపడ్డది.

1961 మార్చి 28 వ ఢిల్లీలో నేర్పాటు చేయబడు ప్రత్యేక సమావేశమున యీబహుమతులను ప్రధాని శ్రీ నెహ్రూ రచయితలకు ఇస్తారు.

...—

మహబూబునగరములో జనాభా లెక్కల సేకరణ

మహబూబునగరము, మార్చి 5

మహబూబునగర పట్టణములో గత ఫిబ్రవరిమాసములో జరిగిన జనాభా లెక్కల సేకరణలో 9 మంది సూపర్ వేజర్లు 49మంది గణికులు పనిచేశారు. స్థానిక మున్సిపాల్టీవారి ఆధ్వర్యమున ఈకార్యక్రమము కొనసాగింపబడినది. జనాభాలెక్కల సేకరణలో కొంతమంది గృహస్తులు తమ వివరాలను తెలుపుటలో కొంతమంది గణికులకు ఇబ్బంది కలిగించినారు. ముఖ్యముగా మహమ్మదీయ కుటుంబాల సేకరణలో గణికులకు చాలా ఇబ్బంది కలిగినట్లు తెలిసినది. దీనికి కారణము వాడవాడలలో తగిన ప్రచారము కాకపోవడమని కొందరు ఇక్కడ భావించుచున్నారు. జనాభా లెక్కల సేకరణ గూర్చి ప్రచారముచేయుటకై పైనుండి వచ్చిన పోస్టర్లను, పుస్తకాలను, మున్సిపాల్టీవారు తమ కార్యాలయములో ఒకమూలకు పారవేశారు. కాని తగనప్రచారము చేయలేదు. ఈ కార్యాలయములో జనాభా లెక్కల శిక్షణతరగతులు జరుగుచున్న సందర్భములో ఒకనాడు మున్సిపాల్టీ యెగ్జిక్యూటివ్ ఆఫీసర్ గారి అసభ్య ప్రవర్తనవల్ల గణికులకు ఆఫీసర్ గారిమధ్య కొంత అలజడికలిగినట్లు తెలిసినది. ఈ జనాభా లెక్కల కార్యక్రమాన్ని పూర్తిచేయుటలో గణికులుగాను,వర్యవేక్షకులుగాను, స్థానిక ఉపాధ్యాయులంతా చాలావరకు శ్రద్ధతోను కృషి చేసినారు. (మా. వి.)

—

మత స్థలాలు-రాజకీయ ప్రచారాలు

న్యూఢిల్లీ, మార్చి 5

మత స్థలాలను, యాత్రాస్థలాలను రాజకీయ ప్రచారములకు, ప్రదర్శనలకు వినియోగించకుండా అరికట్టుటకు తగుచట్టాన్ని ఒకటి చేయాలని ప్రభుత్వమును అర్థిస్తూ శ్రీ ఎస్. వి. పరులేకర్ ప్రవేశపెట్టిన తీర్మాన మందలి మూలసూత్రాన్ని నిన్నలోక సభలో అన్ని పక్షాలకు చెందినవారు బలపరిచారు. తీర్మానంప్రాతిపదికంగా బాగానే ఉందని, యీ విషయములో రాష్ట్ర ప్రభుత్వాలు, శాసనసభలు కల్పించుకొనిన బాగుండునని శ్రీ దాతార్ అన్నారు.

పొగాకుపై అదనపు సుంకంపద్దని విజ్ఞప్తి

శ్రీకాకుళంజిల్లా తాలూకా వర్తక సంఘాలచే

సోంపేట, మార్చి 5

నాటు పొగాకుమీద ఇప్పుడువున్న పన్నుకు అధికముగా ప్రతి కిలోగ్రాంకు 10 నయాపైసలు పెంచాలని కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అంచనాలలో పేర్కొనటము జరిగిందని ఇప్పటికే దీనిమీద తలకు మించిన పన్నుల భారము మోపబడిందని యిది పొగాకు పరిశ్రమకు చెందిన వారిని దిగ్భ్రాంతులను చేస్తున్నదని శ్రీకాకుళంజిల్లాపొగాకు వర్తకుల సంఘము చేసిన ప్రకటనలో పేర్కొంటూ యీ పరిశ్రమ మూలపడే ప్రమాద మేర్పడగల పరిస్థితులు తలెత్తగలవని వివరించింది. ఈ పన్ను పెంపకమువల్ల రాష్ట్రములో పొగాకు పరిశ్రమవల్ల జీవించే కుటుంబాలు నిరుద్యోగ సమస్య వెదుర్కోవలసి వస్తుందని, తరచు యీ విధముగా పన్నులు పెంచటము బాధాకరముగా కనపడుతున్నదని యీ ప్రతిపాదనను విరమించవలసిందని ప్రకటనలో కోరబడింది. తాలూకా పొగాకు వర్తకుల సంఘముకూడ యిలాంటి ప్రకటన చేస్తూ పొగాకుపై అదనపు పన్ను విధించవద్దని ప్రభుత్వాన్ని కోరింది.

—

ఖిలాయ్ ఉక్కు పరిశ్రమాగారం

న్యూఢిల్లీ, మార్చి 5

ఖిలాయ్ లో సంవత్సరమునకు 10 లక్షల టన్నుల ఉక్కు నుత్పత్తి చేయగల ఇనుము, ఉక్కు పరిశ్రమాగార నిర్మాణము పూర్తిఅయిందని, దీని నిర్మాణమునకు భారత ఇంజనీర్లు సోవియట్ నిపుణులు కలిసి పని చేశారని, శ్రీయుతులు సర్దార్ స్వర్ణసింగ్, కోసిగిన్ (సోవియట్ ఉపప్రధాని) శేసిన సంయుక్త ప్రకటనలో వెల్లడి చేయనైనది.

తీర్మానంపై జరిగిన చర్చా వివరాలను అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పరిశీలనకు పంపగలనని శ్రీ దాతార్ వెల్లడించగా తీర్మానము వీగిపోయింది. తీర్మానమును వ్యతిరేకించిన వారు కూడ తీర్మాన సూత్రాలను సమర్థిస్తూ మత స్థలాలందు రాజకీయ సంచలనాన్ని అరికట్టి ప్రభుత్వం గట్టిచర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాల మార్పిడి

హైద్రాబాదు, మార్చి 5

[redacted]పల్లి తాలూకా ఫిరంగిపురం ఫిర్కాలోని వెలవర్తిపాడు అనే గ్రామాన్ని, దాని శివారు అయిన సరిపూడిని ఆ ఫిర్కానుంచి విడదీసి గుంటూరు ఫిర్కాలో చేర్చడానికీ, లింగంగుంట గ్రామాన్ని ఫిరంగిపురం ఫిర్కానుంచి విడదీసి సత్తెనపల్లి తాలూకా పెదకూరపాడు ఫిర్కాలో చేర్చడానికి ప్రభుత్వం ఆదేశించింది. ఈ మార్పిడి 1961 జూలై 1వ తేదీ నుంచి అమల్లోనికి వస్తాయి.

—...

రైలుబండ్లు ఢీకొని ఒకనిమృతి

కలకత్తా, మార్చి 5

గయాకు 66 మైళ్ళ దూరంలోగల గురుయాండివద్ద ఒక గూడ్సుమైన మరో రైలుబండితో గ్రుద్దుకొనడము వల్ల ఒక రైల్వేఉద్యోగి మరణించాడు ఆరుగురికి గాయాలు తగిలాయి.

ఆంధ్రా కో ఆపరేటివ్ ల్యాండు మార్టిగేజ్ బ్యాంక్, లిమిటెడ్
పోస్టు బాక్స్ నెం. 257,
హైద్రాబాద్.

నోటీసు

కోలవెన్ను (కృష్ణాజిల్లా) గ్రామం కాపురస్తులు శ్రీ మతి అడుసుమిల్లి క్షమరాంబగారు తమ పేర ఈ బ్యాంకు జారీ చేసిన డిబెంచరు పత్రములు రెండు B V 0661, B V 0662 నెంబర్లు కలవి ఒక్కొక్కటి రు. 1000/- లకు పోగొట్టుకొనినట్లు తెలియపరచి, ఆ పత్రములకు బదులుగా క్రొత్త పత్రములను జారీచేయ వలసినదిగా కోరినారు. ఇందులకు ఎవరికైనా అభ్యంతరమున్నచో ఈ నోటీసుతేదీనుండి 15 రోజులలోగా తెలుపవలెను. ఆ లోగా ఎట్టి అభ్యంతరము రానిచో ఆమెకు క్రొత్త డిబెంచరు పత్రములు జారీచేయబడును.

మోచర్ల దత్తాత్రేయులు
కార్యదర్శి.

టెండర్ నోటీసు

ఈ క్రింద నుదహరింప బడిన ఒరిజినల్ చలానాలతో సీలు టెండర్లు గవర్నమెంట్ ఆల్కాహాలు ఫ్యాక్టరీ కామారెడ్డి కొరకు 1961-1962 వరకు యిందు మూలమున కోరబడుచున్నది.

(1) కామారెడ్డి రైల్వే స్టేషన్‌నుండి గవర్నమెంట్ ఆల్కాహాలు ఫ్యాక్టరీ కామారెడ్డి లెట్రియల్ వరకూ రైలుబోగ్గు చేర్చుటకు (సుమారు 3,000 నుంచి 3,500 టన్నులు సాలానా) టన్నునకు కోరబడు రేటు తెలియపర్చవలెను.

(2) కామారెడ్డి ఆల్కాహాలు ఫ్యాక్టరీనుండి రైలుబోగ్గు బూడిదకొని అచ్చటనుండి తీసివేయుటకు.

పై నుదహరింపబడిన ప్రతి విషయమునకు రూ. 500 చొప్పున స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్‌లో ఈ క్రింద తెల్పబడినట్లు డిపాజిటు చేసి ట్రెజరీ చలానాలతోనహా పంపవలెను.

పై విషయములకు సంబంధించిన వివరాలు ఈ క్రింద సంతకము చేసిన వారి కార్యాలయమునుంచి పనిచేయు దినములలో నియమిత వేళలయందు కనుగొన వచ్చును. సీల్డు టెండర్లు 28 మార్చి 1961 మధ్యాహ్నము 3 గం.ల వరకు లేక ఆ లోపునసేగాని ఈ క్రింద సంతకము చేసిన వారికి అందవలెను. ఈ క్రింద సంతకము చేసినవారు అన్నిటికన్న తక్కువ టెండరును లేక యే టెండరునైన ఒప్పుకొనుటకు గాని నిరాకరించినందుకు కారణము తెల్పుటకు కాని బద్ధులుకారు.

మహమ్మద్ బాఖర్
జనరల్ మేనేజర్ నారాయణగూడా
గవర్నమెంట్ డిస్టిలరీస్ హైద్రాబాద్.

ప్రకటన

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ప్రభుత్వాదేశానుసారము చాల పట్టణములందు తమ బ్యాంకులను తెరిచి పొదుపు ఉద్యమమును గ్రామ గ్రామములకు తీసికొనిపోవు ఉద్దేశముతో సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ల మీదను మరియు సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ల మీదను.

1 మార్చి 1961 నుండి వడ్డీరేట్లు

ఈ క్రింది విధముగా పెంచి యున్నారని తెలుపుటకు సంతోషించుచున్నారు.

సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లపైన 1½% నుండి 2½% ప్రతి సంవత్సరము సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్లపైన 2½% నుండి 2¾%

దేశవ్యాప్తమయిన:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
యొక్క 9.1 ఆఫీసులు జాతీయసేవ చేయుచున్నవి.